

# హైదరాబాద్ వార్త

# మెట్రో రెండో దశకు చిగురిస్తున్న ఆశలు

**బిహెచ్ఈఎల్-లక్డీకాపూల్(26కి.మీ)**

**నాగోల్-ఎల్బీనగర్(5కి.మీ)**

**అంచనా వ్యయం రూ.8,453కోట్లు**



హైదరాబాద్, జూన్ 25 ప్రభాతవార్త : హైదరాబాద్ మెట్రో రైలు రెండో దశ కింద చేపట్టాలని భావించిన మూడు ప్రాజెక్టుల్లో ఒకటైన రాయదుర్గం నుంచి శంషాబాద్ ఎయిర్‌పోర్టు కేరిడార్‌ను రాష్ట్ర ప్రభుత్వమే స్వయంగా చేపట్టాలని నిర్ణయించింది. ఈ మేరకు శంకుస్థాపన కూడా చేసి..ఆయా పనులు ముందుకు సాగుతున్నాయి. అయితే మిగతా రెండు ప్రాజెక్టులైన బిహెచ్ఈఎల్- లక్డీకాపూల్, నాగోల్-ఎల్బీనగర్ వరకు పొడిగింపు ప్రాజెక్టులను కేంద్ర ప్రభుత్వంతో కలిసి జాయింట్ వెంచర్‌గా చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తుండగా..ఆ దిశగా అడుగులు కూడా ముందుకు పడుతున్నాయి. మెట్రో రెండోదశ విస్తరణలో భాగంగా లక్డీకాపూల్-బిహెచ్ఈఎల్, నాగోల్-ఎల్బీనగర్ వరకు మెట్రో నిర్మాణానికి నిధులిచ్చి ఆదుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి చేసిన విజ్ఞప్తికి ఆశలు చిగురిస్తున్నాయి. ఇప్పటికే కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ ప్రాజెక్టుపై పలు సందేహాలను వెలిబుచ్చింది. అందుకు అనుగుణంగా కేంద్రం సందేహాలకు నివృత్తి చేస్తూ పురపాలక శాఖ సమాధానాలు కూడా పంపింది. ఈ నేపథ్యంలో కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రి హర్దీప్‌సింగ్ పూరీని ఢిల్లీలో రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి కెటిఆర్ స్వయంగా కలిసి హైదరాబాద్ మెట్రో రైల్ ప్రాజెక్టు రెండవ దశ విస్తరణకు కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలపాలని కోరారు. లక్డీకాపూల్ నుంచి బిహెచ్ఈఎల్ వరకు 26 కిలోమీటర్లు, నాగోల్ నుంచి ఎల్బీనగర్ వరకు ఐదు కిలోమీటర్ల మెట్రోకు ఆమోదంతో పాటు కేంద్రం ఆర్థిక సహాయం అందించాలని విజ్ఞప్తి చేశారు. అలాగే విమానాశ్రయ మెట్రోకి సూత్రప్రాయ అనుమతి మంజూరు గుర్తించి విజ్ఞప్తి చేశారు. కేంద్ర మంత్రి కూడా సానుకూలంగా స్పందించినట్లు తెలుస్తోంది.

కేంద్రం ఈక్విటీ కింద 20 శాతం నిధులు ఇచ్చే అవకాశం ఉన్నట్లు సమాచారం. కాగా, మెట్రో రెండో దశలో ప్రభుత్వం ప్రధానంగా నాగోల్ నుంచి ఎల్బీనగర్ (5కి.మీ), లక్డీకాపూల్ నుంచి బిహెచ్ఈఎల్ (26 కి.మీ) ఆ రెండు మార్గాలపై దృష్టి పెట్టింది. ఇందులో బిహెచ్ఈఎల్ నుంచి ఇప్పుడున్న మియాపూర్ మెట్రో స్టేషన్‌ను అనుసంధానం చేశారు. అక్కడి నుంచి హఫీజ్‌పేట మీదుగా కొండాపూర్, గచ్చిబౌలి, టోలిచౌకి, మెహిదీపట్నం మీదుగా లక్డీకాపూల్ మెట్రో స్టేషన్‌ను అనుసంధానం చేశారు. ఈ మార్గంలో మొత్తం 23 మెట్రో స్టేషన్లు రానున్నాయి. ఈ రెండు మార్గాలకు రూ.8,453 కోట్లు అంచనా వ్యయంగా నిర్ణయించగా, ఆలస్యం అయినకొద్దీ నిర్మాణ వ్యయం పెరిగే అవకాశాలు ఉన్నాయని మెట్రో అధికారులు పేర్కొంటున్నారు.

## ఎలక్ట్రిక్ బైక్ బ్యాటరీ పేలి అగ్నిప్రమాదం





**ప్రమాదం జరిగిన ఇంటిని పరిశీలిస్తున్న ఇన్‌స్పెక్టర్ మధులత, ఎలక్ట్రిక్ బైక్ బ్యాటరీ పేలడంతో కాలి బూడిదైన వస్తువులు**

**రూ.8లక్షల మేర ఆస్తినష్టం**

తార్నాక, జూన్ 25 ప్రభాతవార్త: ఎలక్ట్రిక్ బ్యాటరీ బైక్ బ్యాటరీ పేలి ఓ ఇంట్లో ప్రమాదం జరిగిన సంఘటన లాలాగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం. లాలాపేట్ ఇందిరానగర్ బికాలనీకి చెందిన డానియల్ తాను ఉండే మొదటి అంతస్తులో తన ఎలక్ట్రిక్ బైక్ బ్యాటరీని చార్జింగ్ పెట్టాడు. చార్జింగ్ పూర్తి అయిపోయిందనుకొని బ్యాటరీ ప్లగ్ తీసివేసి కుటుంబంతో కలిసి చర్చికి వెళ్లారు. ఇంట్లో ఓ వృద్ధురాలు, 5 సంవత్సరాల పాప ఉంది. కాగా కొద్ది సేపటి బాల్‌కాలనీలో ఉన్న బ్యాటరీ నుంచి పొగ మంటలు రావడంతో వృద్ధురాలు తలుపులు పెట్టుకున్నారు. కానీ మంటలు వేగంగా కిటికి నుంచి భారీగా మంటలు అంటుకొని ఇంట్లో ఉన్న వస్తులకు కూడా మంటులు అంటుకున్నాయి. దీంతో ఇది చూసిన స్థానిక బిజెపి నాయకులు మహేష్, రాముఎర్మ మరి కొందరు హుటాహుటిన ఇంటిపైకి వెళ్లి ఇంట్లో ఉన్న ఇద్దరిని బయటకు పంపించారు. ఇద్దరికి ఎలాంటి ప్రమాదం జరుగలేదు. కాగా ఇంట్లో ఉన్న విలువైన ఫర్నిచర్, ఎలక్ట్రానిక్ వస్తువులు, నగదు, దుస్తువులు కాలిబూదిదయ్యాయి. ఫైర్ స్టేషన్ వచ్చి మంటలను ఆర్పారు. కానీ అప్పటికే వస్తువులన్ని కాలిబూదిదయ్యాయి. సుమారు రూ.8లక్షల మేరకు ఆస్తినష్టం వాటిల్లిందని యజమాని డానియల్ అతని కుమారుడు పల్లెపు అమ్మియల్ ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం తమను ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు.

## నిత్యనూతనం-శోభాయమానం కళోపాసన యువనాట్యోత్సవం



**యువనృత్యకళాకారులతో మామిడిహరికృష్ణ, లక్ష్మీశంకర్**

రవీంద్రభారతి, జూన్ 25 ప్రభాతవార్త : భారతీయ శాస్త్రీయ నృత్యరీతులెన్ని ఉన్నా పేరెన్నికగన్న తెలుగుజాతి శాస్త్రీయనృత్యం కూచిపూడి నృత్యమే కాకుండా సాహిత్యంతో కూడుకున్న కీర్తనలకు హావభావాలు జోడించి చక్కని ఆహార్యం నృత్యాభినయంతో ఆ కళకే జీవంపోస్తూ ఆనాటి భరతముని మొదలు నేటి పూజ్యగురువులు, రుషితుల్యులు చిన్నసత్యం వరకు వేలాదిమంది కళాకారులచే పోషింపబడుతున్న ఈ కళాఖండం నేడు నృత్యదీక్షాలయ సంస్థ ఆధ్వర్యంలో జాతీయస్థాయి అద్భుత కళామతల్లి మందిరం రవీంద్రభారతిలో కళాపాసన-యువ నాట్యోత్స వం ప్రఖ్యాత కళాకారులచే నిత్యనూతనం-శోభాయమానంగా ప్రదర్శింపబడడం ప్రశంసనీయమన్న నేటి ప్రదర్శనల్లో పాల్గొంటున్న కళాకారులతో కలిసి జ్యోతిప్రకాసనంచేసి లాంఛనంగా ప్రారంభించి ప్రసంగించిన ముఖ్యఅతిథి తెలంగాణ ప్రభుత్వం భాషా సాంస్కృతికశాఖ సంచాలకుడు డా. మామిడి హరికృష్ణ సంస్థ అధ్యక్షురాలు లక్ష్మీశంకర్ అకుంఠితదీక్షతో ఔత్సాహిక కూచిపూడి యువకళాకారులతో అత్యంత రమణీయంగా హాజరైన అశేష ప్రేక్షకుల సుముఖాన ప్రదర్శింపజేయడం అభినందనీయమని సంస్థ కళాసేవలను కొనియాడారు.

## ఇంటిముందు రోడ్డు పైకి లేచిందని..
## ఇంటినే రోడ్డుకంటే పైకి లేపాడు.. ఇల్లునే కోల్పోయాడు

కుత్బుల్లాపూర్, జూన్ 25 ప్రభాతవార్త : ఎప్పుడో రెండు దశాబ్దాల క్రితం నిర్మించిన ఇల్లది. క్రమేనా రోడ్డు నిర్మాణ పనులతో ఇళ్లు రోడ్డుకంటే కిందికై రోడ్డు పైకయ్యింది. ఇదే తరుణంలో యు ట్యూబ్‌లో కిందికైన ఇంటిని రోడ్డుకంటేపైకి తేవచ్చని చూసి ఆదేవిధంగా ప్రయత్నం చేయగా ప్రమాద వశాత్తు ఇంటిని పైకితీసే క్రమంలో జాకీలు ఊడిపోయి పైకిలేచిన ఇల్లు కాస్తా పక్కింటిపై పడింది. దీనితో లబోదిబోమనటం పక్కింటివారి పనైంది. ఇదెక్కడో కాదు. కుత్బుల్లాపూర్ డివిజన్ శ్రీనివాసనగర్‌లో చోటుచేసుకున్న ఈ వింత సంఘటన ఏకంగా జిహెచ్ఎంసి అధికారుల దృష్టికి వెళ్లి ఏకంగా ఒరిగన ఇంటిని కూల్చి వేయాలని అధికారులు ఆదేశాలు జారీ చేశారు. పక్కింటివారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు, అధికారులు కలిసికట్టుగా ఇంటిని నేలమట్టం చేసేందుకు రంగంసిద్ధం చేశారు. వివరాలు ఇలా ఉన్నాయి. చింతల్ శ్రీనివాసనగర్‌కు చెందిన నాగేశ్వరరావు అనే వ్యక్తి సుమారు 25ఏళ్లక్రితం ఇంటిని నిర్మించుకున్నారు. కాలక్రమేనా ఈ 25 ఏళ్లలో ఇంటికి మించి రోడ్డు పెరిగి పోవడంతో వర్షాకాలంలో వర్షపునీరు రోడ్డుపై పడుతున్న నీరు మొత్తం తన ఇంట్లోకి వచ్చిచేరుతుంది. ఇదేతరుణంలో యుట్యూబ్ లో ఎత్తయిన రోడ్డుకు సమానంలో జాకీల సాయంతో ఇంటిని ఎత్తుగా మార్చుకోవచ్చని చూసి విజయవాడకు చెందిన ఒక కాంట్రాక్టరుకు ఇళ్లు ఎత్తే కాంట్రాక్టును ఇచ్చాడు. అయితే కాంట్రాక్టరు ఆ పనిని నిర్వహిస్తుండగా జాకీ ఒక్కసారిగా ఊడిపోవడంతో ఇళ్లుకాస్తా పక్కింటిపై ఒరిగిపోయింది. దీనితో పక్కింటివారు లబోదిబోమంటూ కాలనీ వాసుల సహయంతో జిహెచ్ఎంసి అధికారులను సంప్రదించగా విచారణ జరిపిన జిహెచ్ఎంసి అధికారులు ఇంటిని కూల్చడం తప్ప మరోమార్గంలేదని నిర్ధారించారు. ఎలాంటి అనుమతిలేకుండా ఇతరులకు ఇబ్బంది కలిగించాడనే కారణాలతో పోలీసులు నాగేశ్వరరావుపై కేసు నమోదుచేశారు. ఇంటిని తక్షణం కూల్చివేయాలని జిహెచ్ఎంసి అధికారులు ఆదేశాలు జారీచేయటంతో స్థానికంగా ఉత్కంఠ పరిస్థితి నెలకొంది.

### పేదవిద్యార్థులకు చేయూతనిచ్చేందుకు
## స్వచ్ఛంద సంస్థలు ముందుకురావాలి

**మాజీ డిజిపి మహేందర్‌రెడ్డి**




**విద్యార్థికి చెక్కును అందజేస్తున్న మహేందర్‌రెడ్డి,శివారెడ్డి**

హైదరాబాద్, జూన్ 25,ప్రభాతవార్త: ప్రతిభ ఉన్న పేద విద్యార్థులకు చేయూత అందించేందుకు ప్రభుత్వంతోపాటు స్వచ్ఛంద సంస్థలు ముందు రావాలని తెలంగాణ మాజీ డిజిపి మహేందర్‌రెడ్డి అన్నారు. సంపాదించడంలో ఉన్న ఆనందంకంటే నలుగురికి సహాయం చేయడంలో ఆత్మసంతృప్తి కలుగుతుందన్నారు. ఈమేరకు ఆదివారం ఎంఎస్ఆర్ ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పదోతరగతి, ఇంటర్‌లో 90శాతం మార్కులు సాధించిన 300లమంది పేద విద్యార్థులకు ఒకొక్కరికి పదివేల రూపాయల ఆర్థిక సహాయం అందించారు. దీనికి మహేందర్‌రెడ్డి ముఖ్యఅతిధిగా హాజరై విద్యార్థులు చెక్కులు పంపిణీ చేశారు. ఈసందర్భంగా మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం అందించిన ఆర్థిక సాయంతోనే విద్యాభ్యాసం చేశానన్నారు. పివి నరసింహరావు స్థాపించిన గురుకుల పాఠశాలల్లో చదువుకోవడమ తన జీవితానికి ఒక పెద్దమలుపు అని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి కెసిఆర్ గురుకుల ప్రాధాన్యత గుర్తించి పెదనద ఎత్తున గురుకులాలు ఏర్పాటు చేయడం వల్ల అనేక మంది పేద,గ్రామీణ విద్యార్థులకు ఎంతో ఉపయుక్తంగా ఉందని వివరించారు. ఈకార్యక్రమంలో ట్రస్ట్ వ్యవస్థాపకులు శివారెడ్డి, సహవ్యవస్థాపకులు శిరీషారెడ్డి, ధనుష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## మేడ్చల్ ట్రాఫిక్ డీసీపీ కార్యాలయం కూల్చివేత

పేట్‌బషీరాబాద్, జూన్25 ప్రభాతవార్త: నూతనంగా నిర్మించి ఇటీవలే ప్రారంభించిన మేడ్చల్ ట్రాఫిక్ డీసీపీ కార్యాలయాన్ని ఆదివారం ఉదయం కూల్చివేత పనులు ప్రారంభించారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం జీడిమెట్ల డివిజన్ పరిధిలోని ఎన్‌సీఎల్ ఎన్‌క్లేవ్ సమీపంలో సుమారు కోటి రూపాయల వ్యయంతో మేడ్చల్ ట్రాఫిక్ డీసీపీ కార్యాలయాన్ని పూర్తి చేసి ఈనెల 5న మంత్రి మల్లారెడ్డి, స్థానిక ఎమ్మెల్యే కెపి వివేకానంద్‌లు ముఖ్య అతిధులుగా పాల్గొని ప్రారంభించారు. అయితే కార్యాలయం ప్రారంభించి నెల రోజులు కూడా కాక ముందే కూల్చివేయడంపై స్థానికుల్లో విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కార్యాలయం నిర్మించిన స్థలం హెచ్ఎండీఏ పరిధిలో ఉందని, అది కూడా రోడ్డు ప్రదేశంలో ఉండడంతో హెచ్ఎండీఏ అధికారుల అభ్యంతరం మేరకు పోలీసులు స్వచ్ఛందంగా కూల్చివేతలు చేపట్టినట్లు సమాచారం. కార్యాలయం నిర్మించక ముందే ఆ స్థలం ఏ పరిధిలోకి వస్తుందో తెలుసుకోకుండానే నిర్మాణం చేపట్టి కోటి రూపాయల ప్రజా ధనాన్ని వ్యర్థం చేయడం పట్ల స్థానికుల్లో తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

## ఈజిప్ట్‌లో ఇండియా జెండా ఎగురవేసిన తెలంగాణ స్విమ్మర్ "గంధం క్వీని"



హైదరాబాద్, జూన్ 25,ప్రభాతవార్త: ఈనెల 24 నుంచి 27వ తేదీ వరకు ఈజిప్టు రాజధాని కైరోలో జరుగుతున్న అంతర్జాతీయ అండర్ వాటర్ ఫిన్స్ సిమ్మింగ్ ఛాంపి యన్‌షిప్ పోటీల్లో స్విమ్మర్ గంధం క్వీని విక్టోరియా భారతం దేశంతరపున పాల్గొని రజత పథకాన్ని సాదించింది. తెలంగాణలోని బర్కత్‌పుర ప్రాంతానికి చెందిన స్విమ్మర్ గంధం క్వీన్ విక్టోరియా ఆదివారం 400మీటర్ల (మోనో ఫిన్) ఛాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొన్న తొలిస్విమ్మర్ గారి కార్డుల్లోకి ఎక్కింది. క్వీన్ విక్టోరియా భారతదేశం తరపున అంతర్జాతీయ స్విమ్మింగ్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొని రజత పథకం సాధించి తెలుగు రాష్ట్రాల వైభవాన్ని ,ఖ్యాతిని ప్రపంచానికి చాటి చెప్పారు. ఈజిప్టు రాజధానిలో జెండా ఎగురవేసినందుకు రాష్ట్ర క్రీడాశాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌తోపాటు పలువురు ప్రముఖులు క్వీన్ విక్టోరియాకు ప్రత్యేక అభినందనలు తెలిపారు.

### కంటోన్మెంట్ ప్రజలకు ఎల్లప్పుడు అండగా ఉంటా : మన్నెక్రిషాంక్

కంటోన్మెంట్, జూన్ 25 ప్రభాతవార్త: కంటోన్మెంట్ ప్రజలకు ఎల్లప్పుడు అండగా ఉంటానని, ఎవరికి ఎలాంటి సమస్యలు ఎదురైనా వాటి పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని మినరల్ డెవలప్‌మెంట్ కార్పోరేషన్ చైర్మన్ మన్నెక్రిషాంక్ తెలిపారు. బస్తీ నిద్రలో భాగంగా శనివారం రాత్రి 7వ వార్డులోని ఎల్ఐసీ బిల్డింగ్ బస్తీలో నిర్వహించిన 14వ బస్తీ నిద్ర విజయవంతంగా జరిగింది. భారీ వర్షాన్ని లెక్క చేయకుండా దాదాపు 500 మంది బస్తీ ప్రజలు పాల్గొన్నారు. బస్తీలో వారు ఎదుర్కొంటున్న ఇబ్బందులను వారు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సహపంక్తి భోజనాలో ఆయన పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ బోర్డు సభ్యుడు శ్యామ్ కుమార్, బిఆర్ఎస్ నాయకులు నందు, శ్రీను, ఈశ్వర్, రాజు, లక్ష్మమ్మ, ఆనంద్, సునీతా, వెంకటేశ్, రాజు, సాయి, రఘు, శేఖర్, బాబు, యువరాజు తదితరులు పాల్గొన్నారు.

# బోనాల అమ్మలు

## గోల్కొండ జగదాంబిక అమ్మవారికి రెండవ పూజ

**ఉజ్జయిని మహంకాళి ఘటాల ఊరేగింపు ప్రారంభం**

- భక్తులతో కిటకిటలాడిన గోల్కొండ కోట
- మహిళలకు తప్పని తిప్పలు



గోల్కొండ బోనాల ఉత్సవాల్లో పాల్గొన్న భక్తులు









**సికింద్రాబాద్ ఘటాల ఊరేగింపును ప్రారంభిస్తున్న మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్**

మెహిదీపట్నం, జూన్ 25, ప్రభాతవార్త : గోల్కొండ కోట భక్తులతో కిటకిటలాడింది. జగదాంబ అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు బారులు తీరారు. ఆశాడమాస బోనాల ఉత్సవాల్లో భాగంగా ఆదివారం గోల్కొండ శ్రీ జగదాంబిక అమ్మవారికి రెండవ పూజను భక్తులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం బోనం సమర్పించి వడిబియ్యం పోశారు. తొట్టెల ఊరేగింపులు, పోతరాజులు, శివసత్తుల విన్యాసాలు, భక్తుల పూనకాల నడుమ గోల్కొండ కోట అంత భక్తిభావంతో నిండిపోయింది. ఆదివారం సెలవురోజు కావడం, రెండవ పూజ జరుగుతుండడంతో భక్తులు పెద్ద ఎత్తున తరలిరావడంతో గోల్కొండ కోట భక్తులతో కిటకిటలాడింది. అడుగుతీసి అడుగు వేయలేని పరిస్థితులు నెలకొనడంతో భక్తులకు ఇబ్బందులు తప్పలేదు. గోల్కొండ కోట చారిత్రాత్మక ప్రదేశం కావడం, కోటపై బోనాల ఉత్సవాలు జరుగుతుండడం తో పరిసర ప్రాంతాల నుంచే కాకుండ నగరం నలుమూల నుంచి భక్తులు భారీగా తరలివచ్చారు. దేవాదాయశాఖ అధికారులు, ఆలయ కమిటీ సభ్యులు భక్తలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండ అన్ని ఏర్పాట్లు చేశామని చెబుతున్నా ఊహించని విధంగా భక్తులు తరలిరావడంతో ఎన్ని ఏర్పాట్లు చేసినా ఫలితం లేకుండా పోయింది. ప్రత్యేక పూజల్లో ఆలయ కమిటీ చైర్మన్ ఆరెల్ల జగదీష్ యాదవ్, కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

**మితిమీరుతున్న పోకిరీల ఆగడాలు..** గోల్కొండ కోటలో పోకిరీల ఆగడాలు మితి మీరుతున్నాయి. బోనాల ఉత్సవాలకు భక్తులు పెద్ద ఎత్తున తరలిరావడంతో పోకిరీలు రెచ్చిపోతున్నారు. మహిళా భక్తులు అనేక ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుంది. మహిళల కోసం ప్రత్యేకంగా భారీ క్యూలైన్లు ఏర్పాటు చేస్తున్నా ప్రయోజనం లేకుండా పోతుంది. ఇప్పటికైనా దేవాదాయశాఖ అధికారులు, పోలీసులు చొరవ తీసుకొని పోకిరీల ఆగడాలను అరికట్టాలని భక్తులు కోరుతున్నారు.

కంటోన్మెంట్, జూన్ 25 ప్రభాత వార్త: ఆషాడబోనాల ఉత్సవాల ను పురస్కరించుకొని ఆదివారం సికింద్రాబాద్‌లోని శ్రీ ఉజ్జయిని మహంకాళి అమ్మవారి ఆలయం వద్ద జరిగిన ఘటాల ఊరేగింపును రాష్ట్ర పశుసంవర్ధక, సినిమాటోగ్రాఫీ శాఖల మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్‌కు ఆలయ నిందితులు, అర్చకులు పూర్ణ కుంభంతో మంత్రి తలసాని స్వాగతం పలికారు. అనంతరం అమ్మవారిని దర్శించుకొని పూజలు నిర్వహించారు. ఘటాల ఊరేగింపుకు ముందు డప్పుచప్పుల్లు, పోతరాజుల నృత్యాలతో ఆలయ పరిసరాలు మారుమ్రోగాయి. ఈ కార్యక్రమంలో ఆలయ ఈఓ మోహన్ రెడ్డి, ఆలయ కమిటీ చైర్మన్, ధర్మకర్తలు, రాంగోపాల్‌పేట్ డివిజన్ బిఆర్ఎస్ అధ్యక్షులు శ్రీనివాస్ గౌడ్ పాల్గొన్నారు.

**గ్యాస్ మండిలో అమ్మవారికి సాక సమర్పించిన మంత్రి అడ్డగుట్ట..** తెలంగాణ సంస్కృతి సాంప్రదాయాలను పరిరక్షించుకోవాలని రాష్ట్ర పశుసం వర్ధక, సినిమాటోగ్రాఫీ శాఖల మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ తెలిపారు. ఆషాడ బోనాల ఉత్సవాలను పుర స్కరిం చుకొని ఆదివారం మోండా మార్కెట్ డివిజన్ గ్యాస్ మండిలోని 18 టెంపుల్ ముత్యాలమ్మ అమ్మ వారికి నిర్వహించిన సాక ఉత్సవాలకు ఆయన ముఖ్య అతిధిగా హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు.

## నేడు ఉప్పల్ రింగు రోడ్డులో స్కైవాక్ ప్రారంభం

**ప్రారంభించనున్న మంత్రి కేటీఆర్**

**తెలంగాణలోనే మొదటి స్కైవాక్ జంక్షన్**

**25 కోట్ల రూపాయల వ్యయంతో నిర్మాణం**



ఉప్పల్, జూన్ 25 ప్రభాతవార్త : తెలంగాణ రాష్ట్రంలోనే మొదటిసారిగా ఉప్పల్ రింగ్ రోడ్‌లో బస్ టెర్మినల్స్ జంక్షన్‌ను ఏర్పాటు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన బస్ టెర్మినల్ జంక్షన్‌ను రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి కే.తారక రామారావు సోమవారం ప్రారంభించనున్నారు. ఉప్పల్ రింగ్ రోడ్డులో నిర్మించిన స్కైవాక్ చుట్టూ ఉన్న ఆరు ప్రాంతాలను కలుపుతూ నిర్మించారు. హైదరాబాద్ మెట్రో డెవలప్‌మెంట్ అథారిటీ ఆధ్వర్యంలో నిర్మాణం జరిగింది. వరంగల్ హైవేలో ఉన్న బస్ టెర్మినల్ నిర్మాణం వల్ల నడకదారిన వెళ్లే వారికి ఉపయోగకరంగా ఉంటుందని దీంతో రోడ్డు ప్రమాదాలు కూడా తగ్గుతాయని అధికారులు పేర్కొంటున్నారు. ఘట్‌కేసర్, రామంతాపూర్, సికింద్రాబాద్ వైపు వెళ్లే బస్టాండ్లకు ఈ స్కైవాక్ రింగు రోడ్డు ద్వారా నడక దారిన చేరుకోవచ్చు. ఉప్పల్ రింగ్ రోడ్డులో ఉన్న విద్యాసంస్థలు, క్రీడా ప్రాంగణాలు. వ్యాపార సముదాయాలు మెట్రో స్టేషన్‌కు అనుసంధానం చేస్తూ నిర్మాణం జరిపారు. ప్రజల సౌకర్యార్థం మెట్లు, ఎలివేటర్లతో ఆరు హాఫ్ స్టేషన్లతో నిర్మించబడింది. ఆరు మీటర్ల పొడవుతో అందరినీ ఆకట్టుకునే విధంగా రూపొందించారు. స్కైవాక్ నిర్మాణానికి మైల్డ్ స్టీల్, సబ్ స్ట్రక్చర్‌తో నిర్మించి వ్యూహాత్మక ప్రదేశాలలో రైలింగ్ ఫ్యాబ్రిక్ రూఫింగ్‌తో నిర్మించారు. 25కోట్ల రూపాయలతో రాష్ట్ర ప్రభుత్వం స్కై వాక్‌ను ప్రతిష్టాత్మకంగా నిర్మించింది. పాదాచారులు స్కైవాక్‌పై సురక్షితంగా, శాంతియుతంగా వెళ్లేందుకు ప్రభుత్వం ప్రణాళిక బద్ధంగా ఈ నిర్మాణాన్ని చేపట్టింది.

## విద్యతోనే సమాజంలో మంచి గుర్తింపు, విద్యార్థులు నిరంతరం కష్టపడి చదవాలి

ఎంపి రవిచంద్ర వడ్డి రాజు



**రాజ్యసభ సభ్యులు రవిచంద్ర వద్దీ రాజు,పాతనగర మున్నూరు కాపు సంఘం ప్రతినిధులు**

చార్మినార్, జూన్ 25 ప్రభాతవార్త : విద్యతోనే సమాజంలో మంచి గుర్తింపు లభిస్తుందని, విద్యార్థులు నిరంతరం కష్టపడి చదివితే తప్పకుండ ఉన్నత శిఖరాలను అధిరోహిస్తారని రాజ్యసభ సభ్యులు రవి చంద్ర వడ్డి రాజు అన్నారు. పాతనగర మున్నూరు కాపు సంఘం ఆధ్వర్యంలో ఆదివారం గౌలిపురలోని కన్యకా పరమేశ్వరి ట్రస్ట్ భవనంలో జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిధిగా విచేశారు. విద్యార్థులకు నోట్ పుస్తకాలు పంపిణీ చేయటంతో పాటు విద్యలో ప్రతిభ కనపరిచిన విద్యార్థులకు మెరిట్ క్యాష్ అవార్డులను ఆయన ప్రధానం చేశారు. ఈ సందర్భంగా ఎంపి రవిచంద్ర వడ్డి రాజు మాట్లాడుతూ పాతనగర మున్నూరు కాపు సంఘం సామాజిక కార్యక్రమాలు చేపట్టినందుకు అభినందిస్తున్నానని, సంఘం అభివృద్ధికి తన వంతు అన్ని విధాల సహాయాన్ని అందిస్తానని తెలిపారు. మున్నూరు కాపులు అన్ని రంగాలలోను మరింత అభివృద్ధి సాధించవలసిన అవసరం ఎంతైనా ఉందని ఆయన తెలియజేశారు. పాతనగర మున్నూరు కాపు సంఘం అధ్యక్షులు తిరుపతి శివకుమార్ సంఘం చేపట్టిన కార్యక్రమాలు గురించి వివరించారు. దాదాపు మూడు వందల మంది విద్యార్థులకు నోట్ పుస్తకాలతో పాటు విద్యార్థులకు మెరిట్ క్యాష్ అవార్డులను అందజేయటం జరిగిందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం సంఘం అధ్యక్షులు తిరుపతి శివకుమార్ ,ఉపాధ్యక్షులు ఆరె దత్తు, ప్రధాన కార్యదర్శి చుక్క అశోక్ కుమార్, సంయుక్త కార్యదర్శి అశోక్ కుమార్, కోశాధికారి బాలరాజు, ప్రతినిధులు బి.జానకిరాం, గోవిందరాజు, తిరుపతి రాఘవేంద్ర, తిరుపతి శ్రీనివాస్, ఎం.భాస్కర్‌రావు, మహిళా మండలి అధ్యక్షురాలు పొన్నా సునీత, ప్రధాన కార్యదర్శి తిరుపతి పరమేశ్వరితో పాటు సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

## పాడి కౌశిక్‌రెడ్డి ఎమ్మెల్సీ పదవి నుంచి వెంటనే బర్తరఫ్ చేయాలి

మెహిదీపట్నం, జూన్ 25, ప్రభాతవార్త : ముదిరాజ్ కులస్థులపై అనుచిత వ్యాఖ్యలు చేసిన ఎమ్మెల్సీ పాడి కౌశిక్‌రెడ్డిపై పభుత్వం వెంటనే చర్యలు తీసుకోవడంతో పాటు ఎమ్మెల్సీ పదవినుండి బర్తరఫ్ చేయాలని ముదిరాజ్ సంఘం రాష్ట్ర నాయకులు బండారి వెంకటేష్ డిమాండ్ చేశారు. హుజూరాబాద్‌కు చెందిన ఓ జర్నలిస్టుపై దాడి చేయడంతో పాటు అతని కులంపేరుతో దూషించడాన్ని వ్యతిరేకిస్తూ ఆదివారం కార్వాన్ ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో గుడిలమ్మాపూర్‌లోని వివేకానంద చౌరస్తా వద్ద ఎమ్మెల్సీ పాడి కౌశిక్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. కార్యక్రమంలో పాల్గొన్న బండారి వెంకటేష్ మాట్లాడుతూ...పాడి కౌశిక్‌రెడ్డి కులం దుహంకారంతో మాట్లాడడం సరికాదన్నారు. రాష్ట్రంలో పాడి కౌశిక్‌రెడ్డి తిరగనివ్వమని హెచ్చరించారు. అనంతరం వివేకానంద చౌరస్తా నుంచి ర్యాలీగా వెల్లి గుడిమల్కాపూర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఆయన వెంట నాయకులు చంద్రకాంత్, ముఖేస్, అక్కెర శకంర్ ముదిరాజ్, బండారి నర్సింహ్మా, స్నేహపతి, క్రిష్ణ, హనుమంతు, రాజు, గిరిలు ఉన్నారు.

## సేవా సుపరిపాలన పేదల సంక్షేమం దిశగా బిజెపి

**మాజీ మేయర్ బండకార్తిక చంద్రారెడ్డి**



అభివృద్ధిపై రూపొందించిన ఇంటింటికి బిజెపి కరపత్రాలను చూపిస్తున్న మాజీ మేయర్ బండకార్తికచంద్రారెడ్డి, నాయకులు

తార్నాక, జూన్ 25 ప్రభాతవార్త: సేవా, సుపరిపాలన, పేదల సంక్షేమం దిశగా బిజెపి పాలన కొనసాగుతుందని మాజీ మేయర్ బండకార్తిక చంద్రారెడ్డి పేర్కొన్నా రు. శాంతినగర్, లాలాపేట్ లక్ష్మినగర్ తదితర ప్రాంతాల్లో శక్తికేంద్రం ఇంచార్జి టెంపుల్ సాయి ఆద్వర్యంలో ఇంటింటికి బిజెపి కరపత్రాలను పంపిణి చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన రాష్ట్ర నాయకురాలు బండకార్తిక చంద్రారెడ్డి బిజెపి పాలనలో కొనసాగుతున్న అభివృ ద్ధి పనులపై రూపొందించిన కరపత్రాలను పంపిణీ చేస్తూ బిజేపీకి మద్దతు తెలుపాలని కోరారు. ఈ సందర్భంగా కార్తికరెడ్డి మాట్లాడుతూ డివిజన్‌లో ఎక్కడకి వెళ్లినా సమస్యలే దర్శనమిస్తున్నాయని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో నాయకులు బండచంద్రారెడ్డి, సికింద్రాబాద్ అసెంబ్లీ కన్వీనర్ కందాడి నాగేశ్వర్ రెడ్డి, బండ శివారెడ్డి, జిల్లా కార్య దర్శి వీరన్న, లడ్డు, సంతు, కురపాటి శ్రావణ్, రాముపర్మ, విజయలక్ష్మి, శోభ, అనసూయ, పద్మ, జాన య్య, వేణు, లక్ష్మి, అశోక్, రాహుల్, పడాల శ్రీనివాస్, ప్రభు, సూర్య, ఓం, వేణు, రవి, ప్రకాష్ పాల్గొన్నారు.

## అన్ని రంగాల్లో ప్రాతినిధ్యం కరువైంది

**యాదవ విద్యావంతుల వేదిక**



ప్రసంగిస్తున్న యాదవ విద్యావంతుల వేదిక నాయకులు

చిక్కడపల్లి, జూన్ 25 ప్రభాతవార్త: రానున్న శాసనసభ, పార్లమెంట్ ఎన్నికల్లో యాదవులకు తగిన ప్రాతినిధ్యం కల్పించని రాజకీయ పార్టీలకు ఓట్లు వేసేప్రసక్తే లేదని యాదవ విద్యావంతుల వేదిక రాష్ట్ర అధ్యక్షుడు చలకాని వెంకట్‌యాదవ్ స్పష్టం చేశారు. ఆదివారం బాగ్‌లింగంపల్లి సుందర య్య విజ్ఞానకేంద్రంలో యాదవ విద్యావం తుల వేదిక ఆధ్వర్యంలో రౌండ్‌టేబుల్ సమావేశం జరిగింది. 'సీట్లు-వాటా-ఆర్థిక వాటా-రాజ్యాధికారం అంతిమ బాట' అంశంపై పలు సంఘాల ప్రతినిధులు, వివిధ రంగాల ప్రముఖులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా చలకాని వెంకట్ మాట్లాడుతూ నేలపై యాదవ్, యాదవ ఉపకులాల జనాభా 18శాతం ఉందని, కాగా జనాభా దామాషా ప్రకారం అన్ని రంగాల్లో ప్రాతినిధ్యం కరువైందని ఆందోళన వ్యక్తం చేశారు. దీనిని దృష్టిలో ఉంచుకుని రాజకీయ పార్టీలు యాదవ, యాదవ ఉపకులాలకు 22 ఎమ్మెల్యే స్థానాలు, 7 ఎమ్మెల్సీ, 5లోకసభ స్థానాలు, రాజ్యసభ స్థానాలను కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఆర్‌టిఐ మాజీ చీఫ్ కమిషనర్ వర్రె వెంకటేశ్వర్లు, ద్రవిడ దేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు కృష్ణారావు, కోన గురవయ్య, సినీనటీ కరాటే కల్యాణీ, డాక్టర్ కాలువ మల్లయ్య, చింతల రవీంద్రనాథ్, ఉడుత రవీందర్, మన్మోహన్ యాదవ్, పాచ బోయిన శ్రీహరి, సిద్ధి రమేశ్, మేకల రాములుయాదవ్, నోముల సైదులు, ఆవుల మంజులత, దాసరి శ్రీనివాస్, డాక్టర్ దూదిమెట్ల శ్రీనివాస్, రమేశ్‌యాదవ్, ఆర్‌ఎన్.గౌతమ్ పాల్గొన్నారు.

## సిఎం రిలీఫ్‌ఫండ్ పేద వర్గాలకు వరం లాంటిది: ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్



బాదితుడినికి సిఎం రిలీఫ్‌ఫండ్ చెక్కులు పంపిణి చేస్తున్న అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్

హైదరాబాద్, జూన్ 25 ప్రభాతవార్త : అనారోగ్యంతో మెరుగైన వైద్యం కోసం పేదవర్గాలకు సిఎం రిలీఫ్‌ఫండ్ ఒక వరంలాంటిదని అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ అన్నారు.ఆదివారం గోల్నాకలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో లబ్ధిదారులకు సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణి చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అనారోగ్యంతో బాధపడుతూ మెరుగైన చికిత్స కోసం సిఎం రిలీఫ్‌ఫండ్ ద్వారా ఆర్థిక సహాయం అందజేస్తున్నామని చెప్పారు. ప్రమాదకర వ్యాధులతో మెరుగైన వైద్యం కోసం ప్రైవేటు ఆసుపత్రుల్లో చికిత్స పొందినవారికి ఆర్థికంగా చేయూత అందిస్తున్నామని చెప్పారు. సిఎం కెసిఆర్ ప్రభుత్వం అన్ని వర్గాలకు అండగా నిలుస్తుందన్నారు. ఈ సందర్భంగా చెక్కులు అందుకున్నవారిలో ఎ.కల్యాణి, ఎ.లక్ష్మీ, జె.శేషగిరి, జి.మేఘమాల, ఆర్.రాథామణిలకు రూ.2.68లక్షల విలువగల చెక్కులు అందజేశారు.

## వంట కార్మికులకు పెంచిన వేతనాలు చెల్లించాలి

సైఫాబాద్, జూన్ 25 ప్రభాతవార్త:మధ్యాహ్న భోజన పథకంలో పనిచేస్తున్న కార్మికులకు ప్రభుత్వం పెంచిన వేతనాలను తక్షణమే చెల్లించాలని ఎఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.బాల్‌రాజ్, మధ్యాహ్న భోజనం పథకం వర్కర్స్ యూనియన్ నాయకురాలు పి.ప్రేమ్‌పావని డిమాండ్ చేశారు. లేని పక్షంలో జులై 10వ తేదీ నుంచి వేలాది మంది కార్మికుల నిరవధికంగా సమ్మె చేస్తారని, 7వ తేదీ నుంచి అన్ని జిల్లాల కలెక్టర్ కార్యాలయాల ఎదుట ధర్నాలు, రాస్తారోకోలు నిర్వహిస్తారని, 13వ తేదీన 'చలో హైదరాబాద్' ఆందోళన కార్యక్రమం చేపడతారని వారు హెచ్చరించారు. ఆదివారం సత్య నారాయణరెడ్డి భవన్‌లో జరిగిన వంట కార్మికుల సమావేశంలో వారు మాట్లాడుతూ వంటకార్మికులకు ప్రభుత్వం రోజుకు కేవలం 33 రూపాయలు మాత్రమే చెల్లిస్తూ వారి శ్రమశక్తిని దోపిడీ చేస్తున్నదని ఆరోపించారు. దీంతో కార్మికులు ఆనేక పోరాటాలు చేయడంతో ప్రభుత్వం గత ఫిబ్రవరి మాసంలో వీరికి వేతనాలు నెలకు 3వేల రూపాయలుగా పెంచుతూ జివొ నెంబరు 8ని విడుదల చేయడం జరిగిందని గుర్తు చేశారు. ఈ సమావేశంలో నాయకులు జంపాల రవీందర్, కుంటాల రాములు, రామ్మూర్తి, ప్రసాద్, రామకృష్ణ, ముంతాజ్, లక్ష్మణ్, మాధవి, సాయిలు పాల్గొన్నారు.

## మద్యాన్ని అక్రమణ రవాణా చేస్తే సహించేది లేదు

కంటోన్మెంట్,జూన్ 25 ప్రభాతవార్త: రైల్‌లో ఢిల్లీ నుంచి హైదరాబాద్‌కు మద్యాన్ని అక్రమంగా రవాణా చేస్తున్న ఓ వ్యక్తిని సికింద్రాబాద్ ఎక్సైజ్ పోలీసులు అరెస్టు చేశారు. ఎక్సైజ్ జాయింట్ కమిషనర్ కె.ఏ.బి.శాస్త్రీ ఆదేశాల మేరకు ఎన్‌ఫోర్స్‌మెంట్ అసిస్టెంట్ కమిషనర్ అనీల్ కుమార్ రెడ్డి, ఎక్సైజ్ అధికారులు పవన్ కుమార్, సికింద్రాబాద్ ఎక్సైజ్, రైల్వే పోలీసుల సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం సికింద్రాబాద్ స్టేషన్ వద్ద తనిఖీలు నిర్వహిస్తుండగా ఎస్.ఈశ్వర్ రెడ్డి అనే వ్యక్తి ఢిల్లీ నుంచి 114 మద్యం బాటిళ్లను తీసుకువస్తుండగా ఎక్సైజ్,రైల్వే పోలీసులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకొని మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకొని విచారించగా గత 6 నెలల నుంచి మద్యం బాటిళ్లను ఢిల్లీ నుంచి అక్రమంగా హైదరాబాద్‌కు తీసుకువస్తున్నట్లు ఒప్పుకున్నాడు. దాదాపు రూ.2 లక్షల విలువ చేసే మద్యం బాటిళ్లను సీజ్ చేసినట్లు ఎక్సైజ్ సూపరింటెండెంట్ శ్రీనివాస్ రావ్ తెలిపారు. మద్యాన్ని అక్రమంగా రవాణా చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని సికింద్రాబాద్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ నవనిత తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ అధికారులు శివజ్యోతి, ప్రేమ్‌కుమార్‌రెడ్డి, నిజాముద్దీన్,వనిత, సంగీత పాల్గొన్నారు.

## చెన్నైలో జాతీయ సాంకేతిక పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న దృశ్యం

సరూర్‌నగర్, జూన్ 25 ప్రభాతవార్త: చెన్నైలో సొసైటీ ఆఫ్ ఆటోమొబైల్ ఇంజనీర్స్ (ఎస్ఎఇ) ఆధ్వర్యంలో జరిగిన జాతీయ సాంకేతిక పోటీల్లో హైదరాబాద్ శివార్లలోని నాదర్‌గుల్‌కు చెందిన ఎంవిఎస్ ఆర్ ఇంజనీరింగ్ కాలేజీ విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరచి అవార్డులు సాధించారు. దేశంలోని ఐదు రాష్ట్రాలకు చెందిన సుమారు 80 ఇంజనీరింగ్ కాలేజీలకు సంబంధించిన విద్యార్థులు పాల్గొన్న ఈ పోటీల్లో ఎంవిఆర్ ఎస్ కాలేజీ విద్యార్థులు తమ ప్రతిభతో నాలుగు అవార్డులు సాధించారు. అయితే జాతీయ స్థాయి పోటీల్లో మంచి ప్రతిభ కనబరచి అవార్డులు సాధించిన విద్యార్థులను మాతృశ్రీ ఎడ్యుకేషనల్ సొసైటీ ఛైర్మన్ డాక్టర్ కెపి శ్రీనివాసరావు, సెక్రటరీ కె.కృష్ణకుమార్, కోశాధికారి జె.సుధాకర్, కార్యవర్గ సభ్యులు ఎంవి వాసుదేవరావు, ప్రిన్సిపాల్ కనకదుర్గ, వైస్ ప్రిన్సిపాల్ ఎస్‌జిఎస్ మూర్తి అభినందించారు.

### అమ్మవారిని వేడుకుంటే కోర్కెలు నెరవేరుతాయి : శ్రీగణేష్

కంటోన్మెంట్,జూన్ 25 ప్రభాతవార్త: కంటోన్మెంట్ లాల్‌బజార్‌లో ప్రసిద్ధిగాంచిన శ్రీ మహంకాలి అమ్మవారిని వేడుకుంటే కోరుకున్న కోర్కెలు నెరవేరుతాయని బిఆర్ఎస్ నేత ఎన్.శ్రీగణేష్ తెలిపారు. లాల్‌బజార్ చౌరస్తాలో ప్రసిద్ధిగాంచిన శ్రీ మహంకాలి అమ్మవారి ఆలయంలో ఆదివారం పంచనదుల నీటితో అభిషేకం, 108 కలశాలతో నిర్వహించిన ప్రత్యేక పూజలకు ఆయన ముఖ్య అతిధిగా హాజరై ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈఓ మహేందర్ రెడ్డి, నాయకులు భక్త నిరంజన్, గణేష్, శర్మ, పృధ్వీ, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

## క్షణికావేశంలో ఆత్మహత్యకు పాల్పడకూడదు

**తుకారాంగేట్ ఇన్‌స్పెక్టర్ సి.హెచ్.దయాకర్**



రైల్ నిలయం అంబేద్కర్ నగర్‌లో ప్రసంగిస్తున్న ఎస్ఐ దయాకర్

కంటోన్మెంట్, జూన్ 25 ప్రభాతవార్త: శాంతి భద్రతల పరిరక్షణకు,నేరాలు అదుపు చేసేందుకు పోలీసులు నిరంతరం కృషి చేస్తారని, అందుకు ప్రజల సహకారం కూడా ఎంతో అవసరమని తుకారాంగేట్ ఇన్‌స్పెక్టర్ సి. హెచ్. దయాకర్ తెలిపారు. ఆదివారం రైల్ నిలయం అంబేద్కర్ నగర్‌లో యూత్ వెల్ఫేర్ విజ్ఞప్తి మేరకు తుకారాంగేట్ పోలీసులు బస్తీలో పర్యటించి ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు ఏమైనా ఇబ్బందులు ఉంటే పోలీసులకు సమాచారం అందించాల న్నారు. కుటుంబంలో జరిగే చిన్న చిన్న గొడవలతో క్షణికా వేశంలో ఆత్మహత్యలకు పాల్పడకూడదన్నారు. బస్తీలో కొందరు వ్యక్తులు అసాంఘీక కార్యకలాపాలకు పాల్పడుతూ గొడవలు సృష్టిస్తున్నారని, అదే విధంగా బస్తీ ప్రధాన రోడ్డు మార్గంలో తాగుబోతుల బెడదతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, అందు వల్ల బస్తీలో పోలీస్ పెట్రోలింగ్ పెంచడంతో పాటు సీసీ కెమరాలను ఏర్పాటు చేయాలని అంబేద్కర్ యువజన సంఘం ప్రతినిధులు ఇన్‌స్పెక్టర్ అంబటి అంజనేయులుకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ సంఘం అధ్యక్షుడు బాబు,ప్రధాన కార్యదర్శి ఆశీర్వాదం, ఉపాధ్యక్షులు నర్సింగ్‌రావ్, కె.బాబు, కోశాధికారి ప్రశాంత్, సలహాదారులు ఇప్పల రాములు, పరశరామ్, జోబి బ్రదర్స్, వెంకటయ్య, భాస్కర్, బిజెపి నాయకుడు చిన్నవీరయ్య తదితరులు పాల్గొన్నారు.

## పుస్తకాల పంపిణీ



నోట్ పుస్తకాలు పంపిణి చేస్తున్న ముదిరాజ్ సంఘం నేతలు

సికింద్రాబాద్, జూన్ 25 ప్రభాతవార్త : సికింద్రాబాద్ నియోజకవర్గం పార్సిగుట్ట ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో ప్రభుత్వ, ప్రైవేట్ స్కూల్‌ల విద్యార్థులకు ఉచితంగా నోట్ పుస్తకాలను, పెన్నులు, పెన్సిల్ బాక్స్‌లు పంపిణీ చేశారు. సంఘం అధ్యక్షుడు కనకయ్య ముదిరాజ్, ఆధ్యక్షత వహించగా బీజేపీ ప్రధానకార్యాదర్శి మేకల సారంగపాణి, రాష్ట్ర కాంగ్రెస్ ప్రధాన కార్యాదర్శి నాగేష్‌ముదిరాజ్, ఫౌండర్, ఆర్గనైజర్ మధు ముదిరాజ్, హనుమంతు ముదిరాజ్, శ్రీనివాస్ ముదిరాజ్, రమేష్ ముదిరాజ్, రాకేష్ ముదిరాజ్, అరుణ్, శ్రీనివాస్, రవికుమార్ పాల్గొన్నారు.

## క్రీడోత్సవం నిర్వహించడం శుభ సూచకం

**పద్మశ్రీ బ్యాడ్మింటన్ క్రీడాకారుడు కిదంబి శ్రీకాంత్**



క్రీడాకారులకు బహుమతులు ప్రధానం చేస్తున్న శ్రీకాంత్

అల్వాల్, జూన్ 25 ప్రభాతవార్త: క్రీడోత్సవాలు నిర్వహణ ద్వారా యువ క్రీడాకారుల నైపుణ్యాలు వెలుగులోకి వస్తాయని పద్మశ్రీ బ్యాడ్మింటన్ శ్రీడాకారులు కిదంబి శ్రీకాంత్ పేర్కొన్నారు. భారతీయ జనతాపార్టీ జాతీయ కోశాధికారి సాయి నిర్వహించిన టీం సాయి స్పోర్ట్స్ ఉత్సవ్‌లో బాగంగా బొల్లారంలో జరిగిన బ్యాడ్మింట్ పోటీలు విజేతలకు ఆయన బహుమతులు ప్రధానం చేశారు. క్రీడలను ప్రోత్సహిస్తున్న టీం సాయి బృందాన్ని ఈ సందర్భంగా శ్రీకాంత్ అభినందించారు. యువతను తాము ఎంచుకున్న క్రీడా రంగంలో ప్రోత్సహించాలని తల్లిదండ్రులను ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో మల్కాజిగిరి కార్పొరేటర్ శ్రావణ్ కుమార్, సీనియర్ నేతలు దండుగుల వెంకటేష్, హనుమంతరావు, మదుసూధన్ రెడ్డి, రవి కిరణ్, అజిత్, సాయి, కరుణ తదితరులు పాల్గొన్నారు.

## ఉజ్జయిని మహాంకాళి ఘటాల ఊరేగింపును ప్రారంభించిన మంత్రి



ఘటానికి అలంకరించే ఆభరణాలను అందజేస్తున్న మంత్రి తలసాని

బేగంపేట్,జూన్25 ప్రభాతవార్త: ఆషాఢమాసం భోనాల ఉత్సవాల సందర్భంగా ఆదివారం మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ సికింద్రాబాద్ శ్రీ ఉజ్జయిని మహంకాళి అమ్మవారి దేవాలయాన్ని సందర్శించి అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయం వద్ద డప్పు చప్పుళ్ళు, పోతురాజుల నృత్యాల నడుమ మంత్రి ఘటాల ఊరేగింపును ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆయల ఈఓ మనోహర్‌రెడ్డి, ఆలయ చైర్మన్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## ఆదిపురుష్ సినిమాను లోతుగా అర్థం చేసుకోవాలి

సైఫాబాద్, జూన్ 25 ప్రభాతవార్త: సినీ హీరో ప్రభాస్ నటించిన ఆదిపురుష్ చిత్రంలో కొన్ని తప్పులు ఉన్నప్పటికి సినిమాను లోతుగా అర్థం చేసుకోవాలని అయ్యప్ప కళాపీఠం వ్యవస్థాపక అధ్యక్షుడు డా.మధుబాబు చెప్పారు. ఈ సిమాను చూసిన వారిలో కొంత మంది విమర్శిస్తున్నారని, అయితే లోతుగా అర్థం చేసుకుంటే బాగుంటుంద న్నారు. ఆదివారం ఎన్‌ఎస్‌ఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమా వేశంలో ఆయన మాట్లాడుతూ ఈ సినిమాలో సీతాదేవి పాత్ర గతంలో వచ్చిన సినిమాల కంటే కొంచం భిన్నంగా ఉందని, ధైర్య వంతురా లి గా, ఆత్మవిశ్వాసం కలిగిన మహిళగా నేటి తరం మహిళలు ఆద ర్శం గా ఉందన్నారు. రామాయణానికి, రామనామానికి కొన్ని అతీత మైన శక్తులు ఉన్నాయని, ఈ సినిమాలోని కొన్ని పాత్రలను విమర్శించడం తగదన్నారు.

## అంబర్‌పేట దేవస్థాన సేవా సమితి సమావేశం



సమావేశంలో పాల్గొన్న ప్రముఖులు

హైదరాబాద్, జూన్ 25 ప్రభాతవార్త: అంబర్‌పేట దేవ స్థాన సేవా సమితి సర్వ సభ్య సమావే శం ఆదివారం నాడిక్కడ జరిగింద న్నారు. ఈ సమావే శంలో కార్య వర్గం పలు నిర్ణ యాలు తీసుకోవడం జరిగింది. సమితికి ముఖ్య సలహాదారులు, చైర్మన్‌లు, వైస్-ఛైర్మన్, ఫైనాన్స్ కమిటి ఛైర్మన్‌లను ఎన్నుకోవడం జరిగింది. బోనాలు పండగ తరువాత బుర్జుగల్లిలోని హనుమాన్ దేవాలయం పునర్ :నిర్మాణం చేపట్టడం, 5 మెన్ కమిటి వేసి వారి సూచనలకు అనుగుణంగా నూతన సభ్యత్వం విధివిధానాలను రూపొందించుకోవడం జరుగుతుందని కమిటి సభ్యులు తెలిపారు. ముఖ్య సలహాదారులుగా మాజీ ఎంపి వి.హనుమంతరావు, కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి, ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, మాజీ ఛైర్మన్ కె.దుర్గాప్రసాద్‌రెడ్డి, ఛైర్మన్‌గా పంజాల జ్ఞానేశ్వర్‌గౌడ్, వైస్-ఛైర్మన్‌గా గడ్డం లక్ష్మణ్‌గౌడ్, ఫైనాన్స్ కమిటీ ఛైర్మన్‌గా పంజాల గిరిధర్‌గౌడ్ ఎన్నుకోవడం జరిగింది. ఈ సందర్భంగా పంజాల గిరిధర్‌గౌడ్ అధ్యక్షుడు వై.శంకర్‌గౌడ్, రంగంపల్లి రాజు, బింది మల్లికార్జున్‌గౌడ్, చెంగలి సుధాకర్, దొమకొండ కిషోర్, గడ్డం శ్రీధర్‌గౌడ్, మోర పాండుముదిరాజ్, మలక్‌పేట సత్యనారాయణగౌడ్, ఓంకార్‌గౌడ్ ఘనంగా సత్కరించారు.

## వైభవంగా బోనాల ఉత్సవాలు జరుపుతాము

**ఏకగ్రీవంగా ఎంపికైన ఉత్సవ కమిటీ సభ్యులు**



హైదర్షాకోట్ గ్రామం బోనాల ఉత్సవ నూతన కమిటీ సభ్యులను సన్మానిస్తున్న గ్రామ పెద్దలు కడారి జనార్ధన్‌రెడ్డి

నార్సింగి, జూన్ 25 ప్రభాతవార్త : బండ్లగూడ జాగీర్ కార్పొరేషన్‌లోని హైదర్షాకోట్ గ్రామంలో ఈ సారి బోనాల ఉత్సవాలను వైభవంగా నిర్వహిస్తామని గ్రామ పెద్దలు కడారి జనార్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం దేవాలయంలో పుర ప్రముఖులంతా కలిసి బోనాల ఏర్పాట్లు, నిర్వాహణ, గాలిపోచమ్మ ఆలయ నిర్మాణం తదితర అంశాలపై చర్చించారు. అనంతరం బోనాల ఉత్సవ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన కమిటీ చైర్మన్‌గా చేవెళ్ల యాదిరెడ్డి, వైస్ ఛైర్మన్‌గా ప్రతాప్‌రెడ్డిలను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా కడారి జనార్ధన్‌రెడ్డి, కార్పోరేషన్ డిప్యూటీ మేయర్ పూలపల్లి రాజేందర్‌రెడ్డిలు మాట్లాడుతూ ఆశాడ మాసంలో దశాబ్దాల తరబడి గ్రామ దేవతలకు బోనాలు సమర్పించి, మొక్కులు చెల్లించుకోవడం ఆనవాయితీగా వస్తుందన్నారు. వర్షాకాలం ప్రారంభంలో ప్రజలకు అంటు వ్యాధులు రాకుండా కాపాడాలని కోరుతూ పసుపు, కుంకుమ, వేపాకులతో అందంగా ముస్తాబు చేసిన బోనాలను అమ్మవారికి సమర్పిస్తున్నామని వివరించారు. ఈ కార్యక్రమంలో కార్పోరేటర్ శ్రీనాథ్‌రెడ్డి, మల్లేష్ యాదవ్, పుర ప్రముఖులు మల్లారెడ్డి, నర్సిహ్మారెడ్డి, రాజిరెడ్డి, కుమార్ యాదవ్, చంద్రప్రకాశ్‌గౌడ్, దశరథ్ తదితరులు పాల్గొన్నారు.

## గుట్ట పోచమ్మ బోనాలకు రూ.లక్ష అందజేత



షేక్‌పేట్‌లోని గుట్ట పోచమ్మ ఆలయ బోనాల కోసం లక్ష రూపాయలు అందజేసిన నార్సింగి మున్సిపల్ చైర్ పర్సన్ రేఖ యాదగిరి దంపతులు

నార్సింగి, జూన్ 25 ప్రభాతవార్త : షేక్‌పేటలో రెండేళ్లకోమారు జరుపుకునే గుట్ట పోచమ్మ దేవాలయ బోనాల వేడుకల నిర్వాహణ నిమిత్తం నిర్వాహకులకు నార్సింగి మున్సిపల్ చైర్ పర్సన్ రేఖ యాదగిరి దంపతులు రూ.లక్షను అందజేశారు. ఆదివారం ఆలయానికి వెళ్ల మహిమాన్విత అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం రేఖ మాట్లాడుతూ కొలిచిన వారికి కొంగు బంగారంగా గుట్ట పోచమ్మ అమ్మవారు నిలుస్తుందన్నారు. ఏటేటా అమ్మవారిని కొలిచే భక్తుల సంఖ్య పెరుగుతూనే ఉందన్నారు. అమ్మవారి ఆశీర్వాదంతోనే నేను రాజకీయంలోకి అడుగు పెట్టానని, కౌన్సిలర్‌గా గెలుపొంది, మున్సిపల్ చైర్ పర్సన్‌గా ఎంపికయ్యానని తెలిపారు. అమ్మవారికి ముడుపులు చెల్లించుకొని, ఆశీర్వాదం తీసుకోవడం జరిగిందని రేఖ యాదగిరి వివరించారు.

## నేటి నుంచి బండ్లగూడలో అండర్ వాటర్ టన్నెల్ అక్వేరియం ఎక్స్‌పో ప్రారంభం

నార్సింగి, జూన్ 25 ప్రభాతవార్త : బండ్లగూడ జాగీర్ కార్పోరేషన్ పరిధిలోని జిఆర్‌కే ఫంక్షన్‌హాల్ పక్కన ఉన్న మైదానంలో నేటి నుంచి "అండర్ వాటర్ టన్నెల్ ఆక్వేరియం ఎక్స్‌పో" ప్రారంభమవుతుందని నిర్వాహకులు రాజారెడ్డి తెలిపారు. ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ ఎక్స్‌పో షోను రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్, కార్పోరేషన్ మేయర్ మహేందర్‌గౌడ్, డిప్యూటీ మేయర్ రాజేందర్‌రెడ్డిల చేతుల మీదుగా ప్రారంభించడం జరుగుతుందన్నారు. దుబాయ్, సింగపూర్‌లలో ఉండే ఈ షోను కూకట్‌పల్లిలో ఏర్పాటు చేశామని, ప్రజల నుంచి అనూహ్య స్పందన వచ్చిందన్నారు. ప్రజల కోరిక మేరకు బండ్లగూడలో ఏర్పాటు చేశామని తెలిపారు. అండర్ వాటర్ ప్రదర్శనతో పాటు హోనయండ్లూమ్ స్టాల్స్‌ను కూడా అందు బాటులో ఉంచుతున్నామన్నారు. రకరకాల చేపలు, తాబేళ్లు, జల చరాలు ఈ టన్నెల్‌లో ప్రదర్శించబడుతాయని, పిల్లలు, పెద్దలు అందరూ ఆస్వాదిస్తారని తెలిపారు.

## బోనాలు, బతుకమ్మ విశ్వవ్యాపితం కావటం మనకు గర్వకారణం

**మంత్రి తలసాని శ్రీనివాసయాదవ్**

ధర్నాచౌక్, జూన్ 25, ప్రభాతవార్త: మన సంస్కృతికి, ప్రతీకగా నిలిచే బోనాలు, బతుకమ్మ పండుగలు విశ్వవ్యాపితంగా ప్రసిద్ధికెక్కటం మనకెంతో గర్వకారణమని మంత్రి తలసాని శ్రీనివాసయాదవ్ అన్నారు. ఆదివారం లోయర్‌ట్యాంక్‌బండ్‌లోని జగదీష్ దేవాలయం వద్ద కుమ్మరి సంఘం ఆధ్వర్యంలో బోనాల ఊరేగింపును ఆయన పూజలు చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా తలసాని మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత మన పండుగలను రాష్ట్ర పండుగలుగా ప్రకటించి, ప్రభుత్వమే అన్ని ఏర్పాట్లు చేస్తూ పండుగలను ఘనంగా జరుపుతున్న విషయాన్ని గుర్తుచేశారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడకముందు బోనాల ఉత్సవాలను రాష్ట్ర పండుగగా నిర్వహించాలని కోరినప్పటికీ గత ప్రభుత్వాలు పట్టించుకోలేదని తెలిపారు. ఈనెల 22 న గోల్కొండలో బోనాలు ప్రారంభం అయ్యాయని, వచ్చేనెల 9న సికింద్రాబాద్ బోనాలు, 16 వ తేదీన పాతబస్తీలో బోనాలు జరుగుతాయని వివరించారు. బోనాలు ఘనంగా నిర్వహించేందుకు వివిధ దేవాలయాలకు తెలంగాణ ప్రభుత్వం 15 వేల కోట్ల రూపాయలు విడుదల చేసిందని, దేశంలో ఒక్క తెలంగాణలో మత్రమే ప్రైవేట్ దేవాలయాలకు ప్రభుత్వం నుండి ఆర్థిక సాయం అందుతోందని తెలిపారు.ఈ కార్యక్రమంలో ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్, బీఆర్ఎస్ నేతలు ఎం.ఎన్.శ్రీనివాసరావు, ఎడ్ల హరిబాబు యాదవ్, కుమ్మరి సంఘం నాయకులు పాల్గొన్నారు.

**కుమ్మరిసంఘం బోనాలలో పాల్గొన్న కార్మికనేత వి.శ్రీనివాసరెడ్డి:** ప్రతి సంవత్సరం నిర్వహించుకునే ఆషాఢ మాసం కుమ్మరి సంఘం బోనాల ఉత్సవాలలో కార్మికనాయకుడు, మాజీ కార్పోరేటర్ వి.శ్రీనివాసరెడ్డి హాజరయ్యారు. ఆదివారం లోయర్‌ట్యాంక్‌బండ్‌లోని జగదీష్ మందిర్‌లో ప్రారంభమైన బోనాల ఉత్సవాలలో కుమ్మరి సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎన్.నగేష్, బోనాల కమిటీ ఛైర్మన్ ఎన్.శ్రీనివాస్, హనుమంతరావు శ్రీనివాసరెడ్డిని ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు కల్వగోపి, సిరిగిరిశ్యాం, కార్తీక్‌యాదవ్, అంజు, శివ, మధు, వెంకటేష్, అమిత్, వంశీ, రాజేష్, త్రినాథ్ పాల్గొన్నారు.

## రెండో విడత దళిత బంధు పథకం అమలుకు లబ్ధిదారులను ఎంపిక చేయాలి



సిఎం కెసిఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న యాదయ్యమాదిగ

సైఫాబాద్, జూన్ 25 ప్రభాతవార్త: దళిత బంధు పథకం అమలుకు రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేయడం పట్ల తెలంగాణ మాదిగ సంక్షేమ సంఘం హర్షం వ్యక్తం సిఎం కెసిఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేసింది. ఆదివారం ట్యాంక్‌బండ్ వద్దగల డా.బి.ఆర్.అంబేద్కర్ విగ్రహం ఎదుట ఆనేక మంది సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గడ్డ యాదయ్యమాదిగ నేతృత్వంలో సంఘం నాయకులు కెసిఆర్ చిత్రపటానికి పెద్ద ఎత్తున పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా యాదయ్యమాదిగ మాట్లాడుతూ సిఎం కెసిఆర్ రెండో విడత దళిత బంధు పథకం అమలుకు లబ్ధిదారులను ఎంపిక చేయాలని, ఆయా జిల్లాల కలెక్టర్లకు ఆదేశాలు జారీ చేయడం హర్షించదగ్గమన్నారు. రెండో విడితలో ఒక లక్షా 30 వేల దళిత కుంటుబాలకు పది లక్షల చొప్పున ఆర్థిక సహాయం అందజేయనున్నదని ఆయన తెలిపారు. దీంతో దళితుల కుటుంబాలు కొంత మేరకు అభివృద్ధి బాట పడతాయని, కెసిఆర్ మాదిగల అభివృద్ధి పట్ల చూపుతున్న ఆర్థిక సహాయానికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు కొంపల్లి నరేష్, పి.యాదయ్య, గజ్జెల సూర్యనారాయణ, విజలక్ష్మి, లక్ష్మీభాయి, నాగరాణి, శోభారాణి తదితరులు పాల్గొన్నారు.

## సిఎం రిలీఫ్ ఫండ్ ద్వారా పేదలకు నాణ్యమైన వైద్యం

**ఎమ్మెల్యే ముఠాగోపాల్**



లబ్ధిదారులకు చెక్కును అందిస్తున్న ఎమ్మెల్యే ముఠాగోపాల్

చిక్కడపల్లి, జూన్ 25 ప్రభాతవార్త: ముషీరాబాద్ నియోజకవర్గంలో లక్షలాది రూపాయల వ్యయంకాగల సిఎంఆర్ఎఫ్ రిలీఫ్ ఫండ్ కింద చెక్కులను అర్హులైన లబ్ధిదారులకు అందించడం జరిగిందని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠాగోపాల్ అన్నారు. ఆదివారం బాగ్‌లింగంపల్లిలోని నైబర్‌హుడ్ కమ్యునిటీ హాల్‌లో ఎల్‌ఓసి కింద రూ.లక్ష విలువైన పత్రాన్ని, సోమయ్యకు రూ.60వేలు, నందినికి రూ.24వేల చెక్కును బిఆర్ఎస్ యువనేత ముఠాజైసింహా, పార్టీ డివిజన్ అధ్యక్షుడు రావులపాటి మోజెస్‌తో కలిసి పంపిణీ చేసి ప్రసంగించారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ నేతలు మన్నెదామోదర్‌రెడ్డి, వెంకటకృష్ణ(బబ్లూ), సిరిగిరి కిరణ్, టెంపుల్ జనార్ధన్, ఎం.వి.జనార్ధన్, శివకుమార్‌యాదవ్, ఆర్.జయదేవ్, రఫీక్, రమేశ్‌రెడ్డి, సంతోష్‌గౌడ్, ఆర్.సంతోష్, వై.సత్యనారాయణ, ఎర్రం శేఖర్, సిపిఐ ముషీరాబాద్ నియోజకవర్గం కన్వీనర్ బి.వెంకటస్వామిగౌడ్ తదితరులు పాల్గొన్నారు. ప్రజలకు నాణ్యమైన వైద్యం అందించాలనే సంకల్పంతో ఈ రంగానికి అధిక నిధులను కేటాయించడం జరిగిందన్నారు.

## గోవులను అక్రమంగా తరలించకుండా కఠిన చర్యలు తీసుకోవాలి

**బీజేవైఎం ముషీరాబాద్ కన్వీనర్ గడ్డం నవీన్**



ఫొటోరైటప్: చిక్కడపల్లి ఏసీపీ యాదగిరికి వినతిపత్రం అందచేస్తున్న బీజేవైఎం నాయకులు

ధర్నాచౌక్, జూన్ 25, ప్రభాతవార్త: బక్రీద్ పండుగ సందర్భంగా గోవులను, గోదూడలను అక్రమంగా తరలించకుండా కఠిన చర్యలు తీసుకోవాలని బీజేవైఎం ముషీరాబాద్ కన్వీనర్ గడ్డం నవీన్ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఆదివారం ముషీరాబాద్ పోలీస్‌స్టేషన్‌లో చిక్కడపల్లి ఏసీపీ యాదగిరికి, సీఐ జహంగీర్ యాదవ్‌కు బీజేవైఎం ప్రతినిధి బృందంతో కలసి వినతి పత్రం అందచేశారు. ఈ సందర్భంగా నవీన్ మాట్లాడుతూ భాగ్యనగర్‌లో కానీ ముషీరాబాద్ పరిసర ప్రాంతాలలో కానీ గోవులను, గోదూడలను కబేళాలకు తరలించకుండా ఆపాలని, చెక్ పోస్టుల వద్ద తనిఖీలు చేయాలని, బక్రీద్‌పండుగ సందర్భంగా గోవులను కాపాడేందుకు నిఘా పెట్టాలని కోరారు. ఆర్టికల్ 48, నిషేధిత గోవధ చట్టం 1977 ప్రకారం గోహంతకులను శిక్షించాలని, గోరక్షకులకు తగిన భద్రత కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ ముషీరాబాద్ కన్వీనర్ ఎం.నవీన్‌గౌడ్, గోరక్షకులు వివేకానంద, రాకేష్, చక్రపాణి, కంచి, సత్యనారాయణ, నవీన్, వినయ్ పాల్గొన్నారు.

## బిసీ జాబితాలో తొలగించిన 26 కులాలు చేర్పించాలి : ఆర్.కృష్ణయ్య



తిరుమలగిరిలో బిసీ ఆత్మ గౌరవ సభలో ఎంపి ఆర్.కృష్ణయ్య

కంటోన్మెంట్, జూన్ 25 ప్రభాతవార్త: తెలంగాణ రాష్ట్ర విభజన తరువాత బిసీలలోని 26 కులాలను తొలగించడం సరైంది కాదని జనాభాలో 50 శాతానికి పై బడి ఉన్న బిసీ కులాల రిజర్వేషన్లను పెంచాలని బిసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు, పార్లమెంట్ సభ్యుడు ఆర్.కృష్ణయ్య పిలుపునిచ్చారు. తెలంగాణ రాష్ట్రం తొలగించబడిన 26 బిసీ కులాల పోరాట సమితి ఆధ్వర్యంలో ఆదివారం కంటోన్మెంట్ తిరుమలగిరి గౌరి భవనంలో ఏర్పాటు చేసిన అత్మ గౌరవ సభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. పొట్టకూటి కోసం 50 యేండ్ల క్రితం ఏపీ నుంచి తెలంగాణకు వలస వచ్చిన బిసీలాలోని 26 కులాలను తెలంగాణ ప్రభుత్వం తొలగించడంతో విద్యా, ఉద్యోగ అవకాశాల్లో నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తొలగించిన 26 బిసీ కులాలను తెలంగాణ బిసీ జాబితాలో చేర్చాలని ఆయన డిమాండ్ చేశారు. అదే విధంగా కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాల్లో ఓబిసి హక్కులు కూడా కోల్పోతున్నారన్నారు. జాతీయ ఓబిసి హక్కుల పోరాట సమితి అధ్యక్షులు అల్ల రామక్రిష్ణ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో జనసేనా తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు శంకర్ గౌడ్, నాయకులు రాజశేఖర్, ఎర్ర సత్య నారాయణ, అప్పారావ్, రామక్రిష్ణ పాల్గొన్నారు.

## మాలలు విద్యా, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో రాణించాలి

**బిజెపి జాతీయ కార్యవర్గ సభ్యులు వివేక్ వెంకటస్వామి**

హైదరాబాద్, జూన్ 25, ప్రభాతవార్త: మాలలు విద్యా, ఉద్యోగ, రాజకీయ పరంగా రాణించాల్సిన అవసరం ఉందని పార్లమెంట్ మాజీ సభ్యులు, బిజెపి జాతీయ కార్యవర్గ సభ్యులు వివేక్ వెంకటస్వామి అన్నారు. ఆదివారం మింట్‌కాంపౌండ్‌లోని అంబేడ్కర్ స్ఫూర్తిభవన్‌లో జాతీయ మాలల ఐక్యవేదిక ఆధ్వర్యంలో సమాజ సేవలో చురుకుగా పాల్గొన్న పలువురు మహిళలకు దళితరత్న అవార్డులు ఇచ్చి సత్కరించారు. కట్టాశోభారాణి, టి.అంబిక, బి.ప్రమీల, ఉమారాణిలకు దళితరత్న అవార్డులు ఇవ్వగా.. టి.ప్రసన్నకు యువరత్న అవార్డును, ఎస్ అంజలీకుమారికి సావిత్రీబాయి పూలే, రమాబాయి అంబేడ్కర్ సేవారత్న అవార్డులను డాక్టర్ వివేక్‌తో పాటు నిర్వాహక సంస్థ అధ్యక్షులు కరణం కిషన్ అతిథులు అందజేశారు. ఈసందర్భంగా వివేక్ మాట్లాడుతూ దళితులు మొదటగా విద్యాపరంగా ముందుకు వెళ్లాలని, అది ఉంటే మిగతావన్నీ వారి ముందుకే వస్తాయని పేర్కొన్నారు. బిఆర్ అంబేడ్కర్ ఎడ్యూకేషన్ సొసైటీ ద్వారా ఎస్సీ, ఎస్టీ విద్యార్థుల్లో చదువులో ప్రతిభ చూపి



అవార్డులు అందుకున్న మహిళలతో వివేక్ వెంకటస్వామి

ఆర్థికంగా వెనబడిన వారికి 40లక్షల రూపాయల వరకు చెల్లించిన ఫీజులను రియంబర్స్‌మెంట్ ద్వారా తిరిగి ఇచ్చామని తెలిపారు. కరణం కిషన్ మాట్లాడుతూ సమాజంలో ఒకస్థాయి చేరిన మాలలు వెనకబడిన వారిని ప్రోత్సహించాల్సిన అసవరం ఉందన్నారు. కార్యక్రమంలో జిహెచ్‌ఎంసి డిప్యూటీ పివో ఎస్ లలిత కుమారి, దిత నేతలు డి.నర్సయ్య, చెర్ల అంజిరెడ్డి, సంధ్యారాణిలతోపాటు జాతీయ మాలల ఐక్యవేదిక కార్యనిర్వాహాక అధ్యక్షుల పి.రఘురాం, ఉపాధ్యక్షులు ఆవుల సుధీర్, ప్రధాన కార్యదర్శి మన్నె శ్రీరంగ, కార్యదర్శి ఎస్‌బి మోహన్ పాల్గొన్నారు.

## తెలంగాణ సాంస్కృతిక వైభవంపై కవితాగానం

చిక్కడపల్లి, జూన్ 25 ప్రభాతవార్త: తెలుగు సంస్కృతి, సాహిత్యానికి విదేశాల్లో ఉన్న వంగూరి చిట్టెన్‌రాజు కృషి చేయడం అభినందనీయమని వక్తలు పేర్కొన్నారు. 30 మంది కవులు తెలంగాణ సాంస్కృతిక వైభవంపై స్వీయ కవితాగానంతో త్యాగరాయ గానసభ హోరెత్తింది. వంగూరి ఫౌండేషన్ ఆఫ్ అమెరికా ఆధ్వర్యంలో 'నెలనెలా తెలుగు వెన్నెల' 175వ ప్రపంచ వ్యాప్తంగా జరుగుతున్న 'తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలు' సందర్భంగా ప్రత్యేక కవిసమ్మేళనం కార్యక్రమం లబ్ద ప్రతిష్ఠులైన కవులతో పాటు వర్ధమాన, ప్రవర్ధమాన కవులు తమ కవితలను వినిపించే కార్యక్రమం నిర్వాహక సంస్థ మేనేజింగ్ ట్రస్టీ, కళాబ్రహ్మ డాక్టర్ వంశీ రామరాజు ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి చిక్కడపల్లి శ్రీ త్యాగరాయ గానసభలోని కళావేంకట దీక్షితులు కళావేదికలో జరిగింది.

## ఎమ్మెల్సీకౌశిక్ రెడ్డిని భర్తరఫ్ చేయాలి : పిట్ల నాగేశ్



జూబ్లీ బస్టేషన్ వద్ద ఎమ్మెల్సీ కౌశిక్‌రెడ్డి దిష్టిబొమ్మను దగ్ధం చేస్తున్న ముదిరాజ్ సంఘం నేతలు

కంటోన్మెంట్, జూన్ 25 ప్రభాతవార్త: ముదిరాజ్ కులాన్ని, ముదిరాజ్ జర్నలిస్టును కులం పేరుతో దూషించి అవమానించిన ఎమ్మెల్సీ కౌశిక్ రెడ్డిని భర్తరాఫ్ చేయాలని కొరివి క్రిష్ణస్వామి ముదిరాజ్ సేవా సమితి చైర్మన్ పిట్ల నాగేశ్ ముదిరాజ్, అధ్యక్షులు శంకర్‌లు డిమాండ్ చేశారు. హుజురాబాద్‌లో సోషల్ మీడియా కెమెరామెన్ అజయ్ ముదిరాజ్‌పై ఎమ్మెల్సీ కౌశిక్ రెడ్డి దాడి చేసి చిత్రహింసలు పెట్టడమే కాకుండా ముదిరాజ్ కులాన్నీ అసభ్యపదజాలంతో దూషించినందుకు నిరసనగా శనివారం సాయంత్రం సికింద్రాబాద్ జెబిఎస్ వద్ద ఎమ్మెల్సీ కౌశిక్ రెడ్డి దిష్టిబొమ్మను ముదిరాజ్ సంఘం నేతలు దగ్ధం చేశారు. ముదిరాజ్‌ల ఐక్యత వర్ధిల్లాలని, ముదిరాజ్‌ల జోలికి వస్తే అడ్డంగా నరికేస్తామని ముఖ్య మంత్రి కేసిఆర్‌కు, కౌశిక్ రెడ్డికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కౌశిక్ రెడ్డి వెంటనే ముదిరాజ్‌లకు, తెలంగాణ ప్రజలకు బహిరంగంగా క్షమాపణ చెప్పాలన్నారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం నేతలు ప్రేమ్‌కుమార్ ముదిరాజ్, నీలకంతం ముదిరాజ్, సంతోష్ ముదిరాజ్, నాగరాజు ముదిరాజ్, యువరాజు, వెంకటేశ్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

## ముగ్ధమనోహారం.. రసభరితం భరతనాట్యం



రిషిత భరతనాట్య ప్రదర్శనలోని ఓ దృశ్యం

రవీంద్రభారతి, జూన్ 25 ప్రభాతవార్త : ప్రముఖ సాంస్కృతిక కళాసంస్థ భరత నాట్యాలయ నృత్యశిక్షణాలయం ఆధ్వర్యంలో రవీంద్రభారతి ప్రధాన మంది రంలో చిన్నారి నామాల రిషిత భారతీయ శాస్త్రీయ నృత్యాలపై అభిరుచితో ఏడేళ్ల చిరుప్రాయంలో ప్రఖ్యాత నాట్యగురువు చిత్రనారాయణన్ వద్ద భరతనాట్య అభ్యా సన ప్రారంభించి సంపూర్ణ పరిణతను చెందిన తర్వాత నేడు భరతనాట్య ఆరం గేట్రం రసభరితం, ముగ్ధమనోహారంగా ప్రదర్శించి విచ్చేసి అసంఖ్యాలైన ఆహుతు లను మంత్రముగ్ధులను చేసింది. రిషిత తన భరతనాట్య ప్రదర్శనను ముందుగా అరభిరాంగం ఆదితాళంలో పుష్పాంజలి అంశంతో ప్రారంభించి; భో శంభో; వర్ణం; తిశ్ర ఆదితాళం గంభీరనాటరాగంలో తిరుతిరు జవరాల; నారాయణతే; తిల్లానా; చివరిగా మంగళం తదితర అంశాలను ఎంతో శృతి లయబద్ధంగా చక్కటి హావభావాలు, ముఖకవళికలతో నర్తించి ఔత్సాహిక ప్రేక్షకులను ఎంతగానో రంజింపజేసింది. ఈ కార్యక్రమానికి విచ్చేసిన ప్రముఖ అతిథులు డా. ఎల్.జయంతిరెడ్డి, ఎ.మురళీముకుంద్, డా. చివుకుల వసంతలక్ష్మి, డా. మృధుల ఆనంద్ తదితరులు పాల్గొని చిన్నారి కళాకారిణి నామాల రిషితను ఎంతగా అభినందించి శుభాశీస్సులు అందజేశారు.

## దేశ సంపదను అమ్ముకోవడంలో బిజెపి విజయం సాధించింది

**ఆప్ రాష్ట్ర కోర్ కమిటి కన్వీనర్ డాక్టర్ దిడ్డి సుధాకర్ ఆరోపణ**

సైఫాబాద్, జూన్ 25 ప్రభాతవార్త: గత 9 సంవత్సరాల బిజెపి ప్రభుత్వ పాలనలో దేశసంపదను అమ్ముకోవడంలో విజయం సాధించిందని ఆమ్ ఆద్మీ పార్టీ తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ దిడ్డి సుధాకర్ విమర్శించారు. ఎన్నో దశాబ్దాల క్రితం స్థాపించిన ప్రభుత్వ రంగ సంస్థలను అడ్డగోలుగా విక్రయిస్తూ ఉద్యోగ భద్రతను దెబ్బతీసి, ఈ 9 ఏళ్ళ కాలంలో ఉద్యోగాలు కల్పించకుండా ఉన్న ఉద్యోగులను తీసివేసి నిరుద్యోగ భారత్‌గా చేసిన ఘనత ప్రభుత్వానిదేనని ఆయన ధ్వజమెత్తారు. ఆదివారం పార్టీ కార్యాలయంలో వివిధ పార్టీలకు చెందిన ఆటో రంగ కార్మిక సంఘాల నేతలు సుధాకర్ సమక్షంలో ఆమ్ ఆద్మీ పార్టీలో చేరారు. వారిని సుధాకర్ పార్టీలోకి సాదరంగా ఆహ్వానించి కండువా కప్పారు.. అనంతరం ఆయన మాట్లాడుతూ అకాశంపైకి కెగిసిన పెట్రోల్, డిజీల్, గ్యాస్, నిత్యావసర వస్తువుల ధరలు, నిరుద్యోగం, ఘోరమైన ద్రవ్యోల్బణం, కార్పోరేట్లకు వేల కోట్లు రుణాల మాఫీ, లెక్కలేనన్ని అబద్ధపు హామీలు, ద్రోహులు బిజెపి సాధించిన 'నిజమైన విజయాలు' అని ఆయన నిశితంగా విమర్శించారు. ఈ కార్యక్రమంలో ఆప్ కోర్ కమిటి సభ్యులు ఎండి మజీద్, డా.సాల్మన్‌రాజు, ఆప్ తెలంగాణ ఆటో డ్రైవర్స్ యూనియన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రుద్రాక్ష మల్లేష్, ఫరూక్, ఆప్ అధికార ప్రతినిధి ప్రవీణ్‌యాదవ్, నాయకులు రాకేష్‌సింగ్, హైదర్, ఇస్మాయిల్ తదితరులు పాల్గొన్నారు.



స్థానికులతో మాజీ కార్పొరేటర్ సురేష్‌రెడ్డి

## సూరారం కాలనీలో సిమెంట్ రోడ్డు ప్రారంభం

జీడిమెట్ల, జూన్ 25 ప్రభాతవార్త: కుత్బుల్లాపూర్ నియోజకవర్గం సుభాష్‌నగర్ డివిజన్ పరిధి సూరారం కాలనీలో నూతనంగా నిర్మించిన సిమెంట్ రోడ్డును ఆదివారం మాజీ కార్పొరేటర్ సురేష్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా సురేష్‌రెడ్డి మాట్లాడుతూ సుభాష్‌నగర్ డివిజన్ పరిధిలోని బస్తీలు, కాలనీలలోని అన్ని సమస్యలను పరిష్కరించడంలో ముందుంటానని హామీ ఇచ్చారు. సుమారు రూ.50 లక్షలతో నిర్మించిన సిమెంటు రోడ్డును ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. రాబోయే రోజుల్లో సర్వే నెంబర్లు 49, 107లలోని ఇండ్లకు పట్టాలు ఉచితంగా పంపిణీ చేసే విధంగా కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, స్థానికులు పాల్గొన్నారు.

## మోడీ ప్రవేశపెట్టే పథకాలు ప్రజలకు ఎంతో మేలు చేకూరుతున్నాయి



పర్వత్‌నగర్‌లో గడపగడపకు బిజెపి కార్యక్రమంలో పాల్గొన్న బిజెపి మేడ్చల్ అర్బన్ జిల్లా అధ్యక్షులు హరిశ్చంద్ర రెడ్డి.

యూసుఫ్‌గూడ, జూన్ 25, ప్రభాతవార్త : కేంద్ర ప్రభుత్వం, దేశప్రధాని నరేంద్ర మోదీ ప్రవేశపెట్టే పథకాలు ప్రజలకు ఎంతో మేలు చేకూరుతున్నాయని బిజెపి మేడ్చల్ అర్బన్ జిల్లా అధ్యక్షులు పన్నాల హరిశ్చంద్ర రెడ్డి అన్నారు. ఆదివారం డివిజన్ పరిదిలోని పర్వత్‌నగర్‌లో బిజెపి మేడ్చల్ అర్బన్ జిల్లా ఓబిసి ఉపాధ్యక్షులు పులిగోళ్ళ శ్రీనువాస్ యాదవ్ ఆధ్వర్యంలో గడపగడపకు బిజెపి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికి వెళ్ళి కేంద్ర ప్రభుత్వ పథకాలను వివరించారు. ప్రజా గోస బిజెపి బరోసా పేరుతో ప్రజలకు తెలంగాణలో బిఆర్ఎస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరించారు. అందులో అస్తవ్యస్తమైన ఆర్థిక వ్యవస్థ, అన్నదాతల అవస్థలు, విస్మరించిన విద్యావ్యవస్థ, ఆదరణ కరువైన ఆరోగ్య రంగం విస్మరించబడిన మహిళా సంక్షేమం యువతపై నిర్లక్ష్యం, నియంతృత్వ కుంటుంబ పాలన తదితర అంశాలపై ప్రజలకు వివరించారు. రాబోయే రోజుల్లో భారతీయ జనతా పార్టీ బలోపేతం చేసేందుకు బూత్ స్థాయిల నుంచి నాయకులు, కార్యర్తలు సైనికుల్లా పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈకార్యక్రమంలో పర్వత్‌నగర్ శక్తికేంద్రం ఇన్‌చార్జ్ భాను, బూత్ అధ్యక్షులు రాజశేఖర్, వెంకటేష్, బొంతు హరికృష్ణ, శ్రావణ్, అంకిత్ సింగ్, వెంకట్‌రెడ్డి, అభిషేక్, కృష్ణంరాజు, రాజేందర్ ప్రసాద్ పాల్గొన్నారు.

## కేంద్రం కుల వృత్తులను ప్రోత్సహిస్తున్నది



సమావేశంలో మాట్లాడుతున్న భారతీబేన్

మెహిదీపట్నం, జూన్ 25, ప్రభాతవార్త : కుల వృత్తుల వారిని ప్రోత్సహించేందుకు కేంద్రప్రభుత్వం అనేక పథకాలను ప్రవేశ పెడుతుందని, వాటిని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని బిజెపి జాతీ ఉపాధ్యక్షురాలు, హైదరాబాద్ పార్లమెంట్ ఇన్‌చార్జ్ భారతీబేన్ కోరారు. ప్రధాని నరేందమోదీ 9 సంవత్సరాల పాలనలో భాగంగా ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాలపై ఆదివారం జియాగూడ జీహెచ్‌ఎంసీ కమ్యూనిటీ హాల్‌లో బిజెపి కార్వాన్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఠాకూర్ అమర్‌సింగ్ ఆధ్వర్యంలో కుల వృత్తుల వారితో సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సమావేశానికి భారతీబేన్ ముఖ్య అతిథిగా హాజరై ముందుగా డాక్టర్ బి.ఆర్.అబేంద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసిన అనంతరం ఆమె మాట్లాడారు. కుల వృత్తుల వారిని గత ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేశాయన్నారు. సమావేశంలో బిజెపి గోల్కొండ జిల్లా అధ్యక్షులు పాండు యాదవ్ నాయకులు ఇంద్రసేనారెడ్డి, డిజ్వర్‌సింగ్, ఆకుల గోవర్ధన్, మునీందర్, లక్ష్మినారాయణ, సతీష్‌బిట్ల కార్యకర్తలు పాల్గొన్నారు.

## సంక్షేమ పథకాలకు ఆకర్షితులై ఇతర పార్టీల నుంచి బిఆర్ఎస్ లో చేరుతున్నారు



బిఆర్ఎస్ పార్టీలోకి కండువా వేసి పార్టీలో చేర్చుకుంటున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

యూసుఫ్ గూడ, జూన్ 25, ప్రభాతవార్త : బిఆర్ఎస్ పార్టీ, రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ చేపడుతున్న ప్రజా సంక్షేమ పథకాలకు ఆకర్షితులై ఇతర పార్టీల నుంచి బిఆర్ఎస్ లో చేరుతున్నారని ఎమ్మెల్యే మాదవరం కృష్ణారావు అన్నారు. ఆదివారం అల్లాపూర్ డివిజన్ పరిధిలోని కాంగ్రెస్ పార్టీ యూత్ నాయకులు పెద్దసంఖ్యలో పాల్గొని డివిజన్ కార్పొరేటర్ సబీహాగౌసుద్దీన్ నియోజకక వర్గం మైనార్టీసెల్ అధ్యక్షులు ఎమ్‌డి గౌసుద్దీన్ ఆధ్వర్యంలో స్థానిక శాసన సభ్యులు మాదవరం కృష్ణారావు సమక్షంలో దాదాపు 200మంది బిఆర్ఎస్ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. ఈసందర్బంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పేదల సంక్షేమమే ధ్యేయంగా చేపడుతున్న సంక్షేమ ఫలాలు పేదలకు ఎంతో ఉపయోగకరంగా ఉన్నాయని గతంలో ఏ ప్రభుత్వం చేయని విధంగా ఏ ముఖ్యమంత్రి చేయని విధంగా అన్ని పథకాలను ప్రవేశపెట్టి అభివృద్దిలో దూసుకుపోతున్నారన్నారు. అదేవిధంగా మంత్రి కేటీఆర్ యువతకు ఆదర్శంగా నిలుస్తున్నారని తెలిపారు. స్థానిక కార్పొరేటర్ సబీహాగౌసుద్దీన్ అన్ని వేళల ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రజా సమస్యలను తీరుస్తున్నారని పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో సయ్యద్ మోసిన్, డివిజన్ కోఆర్డినేటర్ వీరారెడ్డి, డివిజన్ మైనార్టీసెల్ అధ్యక్షులు ఎమ్‌డి నూర్ఖాన్, చాంద్ బాషా, ఫసియుద్దీన్, నిజామ్, సయ్యద్ దస్తగిర్, అక్బర్, అప్రోజ్ తదితరులు పాల్గొన్నారు.

## నరేంద్రమోడీ నాయకత్వాన్ని బలపరచాలి : మహాలక్ష్మీ విజ్ఞప్తి

హైదరాబాద్, జూన్ 25 ప్రభాతవార్త: బిజెపి జాతీయ కమిటి పిలుపు మేరకు హిమాయత్‌నగర్ డివిజన్‌లోని కార్పోరేటర్ జి.మహాలక్ష్మీరామన్‌గౌడ్ బూత్ నెంబర్లు 17, 28లలో మహజన్ సంపర్క్ అభియాన్ కార్యక్రమాన్ని ఆదివారం విజయవంతంగా నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ఆమె పలువురు ప్రముఖులు, ప్రజలతో మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం 9 ఏళ్ళలో సాధించిన అభివృద్ధి, విజయాలను తెలియజేయడం జరిగింది. వచ్చే ఎన్నికల్లో బిజెపికి ఓటు వేసి నరేంద్రమోదీని తిరిగి ప్రధానిగా చేయాలని, మోదీ నాయకత్వాన్ని బలపరచాలని ఆమె విజ్ఞప్తి చేశారు. ఇందులో భాగంగా ఇటీవల కాంగ్రెస్ పార్టీ నుంచి బిజెపిలో చేరిన జిహెచ్‌ఎంసి స్టాడింగ్ కమిటీ సభ్యుడు మధుగౌడ్‌ను ఆమె మర్యాద పూర్వకంగా కలిసి పార్టీలో క్రియాశీలకంగా పనిచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు సాయికుమార్, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా గురు పూర్ణిమ మహోత్సవం



సమావేశంలో పాల్గొన్న పలువురు ప్రముఖులు

చార్మినార్, జూన్ 25 ప్రభాతవార్త : గురు పూర్ణిమ సందర్భంగా జూలై నెల 2వ తేదీన ఎన్‌టిఆర్ స్టేడియంలో శ్రీ గురు పూర్ణిమ మహోత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహించనున్నామని నిర్వాహకులు ప్రకాష్ సోరియా, కైలాస్ నారాయణ్ భగాడియా, ఓం ప్రకాష్‌లు తెలిపారు. శ్రద్దేయ సిద్ద గురు శ్రీ సిద్దేశ్వర్ బ్రహ్మర్షి గురుదేవ్ (తిరుపతి) ఎన్‌టిఆర్ స్టేడియంలో ఆదివారం జరగనున్న గురు పూర్ణిమ మహోత్సవంతో పాటు 3వ తేదీన సికింద్రాబాద్‌లోని క్లాసిక్ గార్డెన్‌లో జరగనున్న శ్రీ గురు మంత్ర దీక్షా కార్యక్రమంలో పాల్గొంటున్నారరని వారు తెలిపారు. కాగా ఆదివారం నిర్వహించిన సమావేశంలో అగ్రవాల్, మాలీ, మహేశ్వరి, కుమావత్, దాహిమా సమాజాలకు ప్రముఖులు పాల్గొన్నారు.

## ఆంక్షా పర్వం, కాలరేఖలు పుస్తకావిష్కరణ



పుస్తకావిష్కరణ చేస్తున్న నారాయణరావు, రామచంద్రమూర్తి, జస్టిస్ నర్సింహ్మారెడ్డి

హైదరాబాద్, జూన్ 25, ప్రభాతవార్త: అత్యవసర పరిస్థితి ప్రకటనకు 48ఏళ్ల, ముట్నూరి కృష్ణారావు వర్ధంతి సందర్భంగా డా.గోపరాజు నారాయణరావు రచించిన "ఆంక్షాపర్వం " (అత్యవసర పరిస్థితి కాలంలో తెలుగు దినపత్రిక పోరాటం, సంఘాటం) కాలరేఖలు ( భారత స్వాతంత్ర్య సమర ఘట్టాలు ) పుస్తకాల ఆవిష్కరణ జరిగింది. వయోధిక పాత్రికేయ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో సినియర్ జర్నలిస్టు దాసు కేశవరావు అధ్యక్షతనఈకార్యక్రమాన్ని నిర్వహించారు. పట్నా హైకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎల్.నర్సింహ్మారెడ్డి, అర్ఎస్ఎస్ భాగయ్య, సీనియర్ పాత్రికేయులు కె.రామచంద్రమూర్తితదితరులు హాజరై పుస్తకాలను ఆవిష్కరించారు. ఈసందర్భంగా అత్యవసర పరిస్థితి కాలంలో జరిగిన సంఘటనలు, భారతస్వాంతత్ర్య ఉద్యమ ఘట్టాలను వివరించారు. ఈసమావేశంలో వయోధిక పాత్రియ సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

## భూదాటి లక్ష్మీనారాయణ ఆస్తులు జప్తుచేసి, బాధితులకు పంచాలి

ధర్నాచౌక్, జూన్ 25, ప్రభాతవార్త: వివిధ ప్రాజెక్టుల పేరుతో ప్రజల నుండి కోట్లాది రూపాయలు కొట్టగొట్టి మోసం చేసిన భూదాటి లక్ష్మీనారాయణ ఆస్తులను తక్షణమే ప్రభుత్వం జప్తు చేసి, బాదితులకు పంచాలని సాహితి శర్వాని ఎలైట్ అమీన్‌పూర్ ప్రాజెక్ట్ విక్టిమ్స్ కమ్యూనిటీ సభ్యులు డిమాండ్ చేశారు. ఆదివారం ఇందిరాపార్కు ధర్నాచౌక్‌లో సాహితి శర్వాని ఎలైట్ అమీన్‌పూర్ ప్రాజెక్ట్ విక్టిమ్స్ పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మధ్య తరగతి వారు సొంత ఇంటి కల నెరవేర్చుకోవటం కోసం ప్రభుత్వ అనుమతులు అన్నీ ఉన్నాయనే నమ్మకంతో పెట్టుబడి పెడితే, అనుమతులకు విరుద్ధంగా డబుల్ రిజిస్ట్రేషన్లు చేసి, కోట్లాది రూపాయలు దండుకున్న లక్ష్మీనారాయణపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. టీటీడీ సభ్యునిగా ఉన్న లక్ష్మీనారాయణ రాజకీయ నాయకుల అండదండలతోనే వివిధ ప్రాజెక్టుల పేరుతో, రియల్ ఎస్టేట్ వ్యాపారం చేసి, అమాయకులను మోసం చేశాడని ఆరోపించారు.

**మాకు అండగా ఉండే పార్టీలకే మా మద్దతు**

**శాంతి నిరుపమా (తెల్లాపూర్) ప్రాజెక్ట్ బాధితుల సంఘం నాయకుల డిమాండ్**

తమకు అండగా ఉండే పార్టీలకే రాబోయే ఎన్నికలలో తమ మద్దతు ఉంటుందని శాంతి నిరుపమా(తెల్లాపూర్) ప్రాజెక్ట్ బాధితుల సంఘం నాయకులు స్పష్టం చేశారు. ఆదివారం ధర్నాచౌక్‌లో సాహితి శర్వాని ఎలైట్ బాధిత సంఘంతో కలసి నిరసన తెలియచేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రేరా, జీహెచ్‌ఎంసీ అనుమతులతో ఫ్లాట్స్ నిర్మాణం చేసి, డబుల్ రిజిస్ట్రేషన్లతో కోట్ల రూపాయలు దండుకున్న లక్ష్మీనారాయణపై చర్యలు తీసుకోవాలని మంత్రి కేటీఆర్‌కు ట్విట్టర్ ద్వారా ఎన్ని సార్లు విజ్ఞప్తి చేసినా పట్టించుకోవటం లేదని ఆరోపించారు.

## రక్త దానం చేయటానికి యువత ముందుకు రావాలి

**కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి**



రక్తదాన శిబిరం కార్యక్రమంలో పాల్గొన్న కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి

మైలార్‌దేవ్‌పల్లి, జూన్ 25 ప్రభాతవార్త : రక్త దానం చేయటం వల్ల మరోక ప్రాణాన్ని రక్షించిన వారమవుతామని, యువత రక్త దానం చేయటానికి ముందుకు రావాలని జిహెచ్‌ఎంసి కౌన్సిల్ బిజెపి విప్, మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి పిలుపు నిచ్చారు. దాతృత్వ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం లక్ష్మీగూడలో నిర్వహించిన రక్త దానం శిబిరంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆపదలో ఉన్న వారికి రక్త దానం చేయటం ఎంతో అవసరమని తెలిపారు. రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేసిన దాతృత్వ ఫౌండేషన్ ప్రతినిధులను ఆయన అభినందించారు. ప్రతీ ఒక్కరూ రక్తదానం చేసి ప్రాణ దాతలుగా నిలవాలని కార్పొరేటర్ శ్రీనివాస్‌రెడ్డి కోరారు. ఈ కార్యక్రమంలో కార్తీక్ గణేష్, శ్రావణ్, అడికే శివ, శ్రీకాంత్ రెడ్డి, రాకేష్, బిజెపి నాయకులతో పాటు దాతృత్వ ఫౌండేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

## కళలు, కథలు గురించి పిల్లల్లో ప్రచారం జరగాలి

చిక్కడపల్లి, జూన్ 25 ప్రభాతవార్త: కళలు, కథలు గురించి పిల్లల్లో ప్రచారం జరగాల్సిన అవసరం ఉందని కేంద్రీయ విశ్వవిద్యాలయం నృత్యవిభాగాధిపతి తడకమల్ల అనూరాధ అన్నారు. జాంబాగ్ బాలానంద సంఘం వ్యవస్థాపకులు మద్దిపట్ల వెంకట్రావు 90వ జయంత్యోత్సవం కార్యక్రమాన్ని ఆదివారం రాత్రి చిక్కడపల్లి శ్రీ త్యాగరాయ గానసభలో సంఘం అధ్యక్షుడు మద్దిపట్ల వెంకటభాస్కర్ ఆధ్వర్యంలో జరిగింది. ఈ కార్యక్రమాన్ని పురస్కరించుకుని 'మద్దిపట్ల నాటకాలు', 'మద్దిపట్ల కథలు' పుస్తకాలను ముఖ్యఅతిథిగా హాజరైన అనూరాధ ఆవిష్కరించగా కార్యక్రమానికి జీడిగుంట వెంకటరావు అధ్యక్షత వహించారు.

## ముదిరాజులను బీసీ-ఏ లో చేర్చాలి

**తెలంగాణ రాష్ట్ర మత్స్యకారుల సంఘం అధ్యక్షురాలు పుష్పలత**



ధర్నానుద్దేసించి ప్రసంగిస్తున్న టీఆర్ఎంఎస్ అధ్యక్షురాలు పుష్పలత

ధర్నాచౌక్, జూన్ 25, ప్రభాతవార్త: బీసీ-డి లో ఉన్న ముదిరాజ్‌లను బీసీ-ఏ లో చేర్చాలని తెలంగాణ రాష్ట్ర మత్స్యకారుల సంఘం అధ్యక్షురాలు పుష్పలత డిమాండ్ చేశారు. ఆదివారం ఇందిరాపార్కు ధర్నా చౌక్‌లో ముదిరాజ్‌లను బీసీ ఏ లో చేర్చాలని డిమాండ్ చేస్తూ ధర్నా నిర్వహించారు. ఈ ధర్నానుద్దేసించి ఆమె మాట్లాడుతూ బీసీ-డి లో ఉన్నందువల్ల ప్రభుత్వ ఫలాలను అందుకోలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. బీసీ ఏ లో ముదిరాజులు లేకపోవటం కార్పొరేషన్ లేదని, ఎటువంటి రిజర్వేషన్లు కూడా పొందలేకపోతున్నారని గుర్తు చేశారు. జీవో నెంబర్ 64 ప్రకారం చెరువులపై హక్కులు ముదిరాజులకు కూడా కల్పించాలని, ముదిరాజ్‌లపై దాడులను అరికట్టాలని కోరారు. బీసీ ఏ లో లేకపోవటం వల్ల కేంద్రం నుండి రాష్ట్రం నుండి ఎటువంటి లబ్ది పొందలేక, ముదిరాజులు వెనుకబడి ఉన్నారని, ముదిరాజులు అభివృద్ధి సాధించాలంటే తక్షణమే బీసీ ఏలో చేర్చాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర మత్స్యకారుల సంఘం నాయకులు శివ, రమేష్, కురుమూర్తి, రాజు, గోనెల్ల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

**ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి : లింగాని ప్రసన్న శ్రీనివాస్**

అడ్డగుట్ట, జూన్ 25 ప్రభాతవార్త: పేద ప్రజల సంక్షేమం కోసం ముఖ్య మంత్రి కేసిఆర్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను అర్హులైన లబ్దిదారులు సద్వినియోగం చేసుకొని ప్రయోజనం పొందాలని అడ్డగుట్ట డివిజన్ కార్పొరేటర్ లింగాని ప్రసన్న శ్రీనివాస్ తెలిపారు. అడ్డగుట్ట ప్రాంతానికి చెందిన అంజనేయులు గుండె వ్యాధితో బాధపడుతున్నాడు. కార్పోరేట్ ఆసుపత్రుల్లో మెరుగైన వైద్యం కోసం మంజూరైన లక్ష రూపాయల ఎల్‌ఓసి పత్రాలను బాధితుడి భార్య పుష్పకు అందజేశారు.

## రాజేంద్రనగర్ నియోజకవర్గంలో కాంగ్రెస్ గెలుపు తథ్యం

**పిసిసి ప్రధాన కార్యదర్శి బి.జ్ఞానేశ్వర్ ముదిరాజ్**



కాంగ్రెస్ పార్టీలో చేరుతున్న ఇతర పార్టీల నాయకులకు కండువాలు కప్పి ఆహ్వానిస్తున్న పిసిసి అధ్యక్షులు రేవంత్‌రెడ్డి

నార్సింగి, జూన్ 25 ప్రభాతవార్త : రాజేంద్రనగర్ నియోజకవర్గంలో ఈ దఫా అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపు తథ్యమని పిసిసి ప్రధాన కార్యదర్శి బి.జ్ఞానేశ్వర్ ముదిరాజ్ పేర్కొన్నారు. ఆదివారం రాజేంద్రనగర్ నియోజకవర్గంలోని బండ్లగూడ, గంధంగూడ, హైదర్షాకోట్, తొండుపల్లి, కొత్వాల్‌గూడ, పెద్ద షాపూర్ తదితర ప్రాంతాలకు చెందిన 400. మంది ఎంఐఎం, బిజెపి, బిఆర్ఎస్ పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీలో చేరారు. వీరందరికి పిసిసి అధ్యక్షులు రేవంత్‌రెడ్డి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. జ్ఞానేశ్వర్, ఫహీం ఖురేషిల నాయకత్వంలో పార్టీలో భారీ ఎత్తున చేరికలు జరిగాయి. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బిఆర్ఎస్, బీజేపీ నాయకులు గల్లీలో కొట్లాడినట్లు నటిస్తూ, ఢిల్లీలో చెట్టాపట్టాలేసుకొని తిరుగుతున్నారని పేర్కొన్నారు. ఈ విషయం ఆయా పార్టీల నాయకులకు, రాష్ట్ర ప్రజలందరికి తెలిసిపోయిందని, దీంతో బీజేపీలోని చాలా మంది నాయకులు ఆ పార్టీని వీడి కాంగ్రెస్‌లో చేరుతున్నారన్నారు. ఎంఐఎం నాయకులు మహ్మద్ అమీన్, సయ్యద్ సాందాని, రహీం హుస్సేన్, సయ్యద్ ఇర్ఫాన్, సలీం, షర్ఫుద్దీన్, మాజిద్, బుర్హాన్, ఆసిఫ్, ఇస్మాయిల్, హమీద్, అఫ్రోజ్, సద్దాం, పాషా, రీగన్, మైమూద్, సాజిద్, సల్మాన్‌లతో పాటు నర్సిహ్మాయాదవ్, ఆదర్శ్ ముదిరాజ్, కుమార్ ముదిరాజ్, రాజు తదితరులు కాంగ్రెస్‌లో చేరిన వారిలో ఉన్నారు.

**బైరాగిగూడలో :** బండ్లగూడ జాగీర్ కార్పోరేషన్ పరిధిలోని బైరాగిగూడ ప్రాంతంలో కాంగ్రెస్ పార్టీ హాత్‌సే హాత్ జోడో యాత్రకు అనూహ్య స్పందన వచ్చింది


**PUBLIC NOTICE**

Be it know to all men, that I, Smt.Maheshwari W/o. Kamal Prakash, has filed an partition suit vide O.S.no.1287 of 1985 presently pending before the Hon'ble IV th Addl. Senior Civil Judge, City Civil Court, Hyderabad, against Harbans Preshad Jaiswal & others in respect of Sechedule-A & B Properties. Whereas there is an injunction restraining (i) H.P.Shivani, D/o Late Harban Pershad Jaiswal, (ii) Smt.Konda Sunanda & (iii) K.Somi Reddy and any person/persons claiming through them, from selling, transferring, etc., the rights in the Schedule-B properties mentioned in Schedule hereunder.

**SCHEDULE-B CONSISTS OF IMMOVABLE PROPERTIES AS UNDER:**

**Item No.1:** All that property being House No.11-2-378, (or any part thereof) Situated at Habeebnagar, Hyderabad.

**Item No.II:** House No.3-5-992, (or any part thereof), situated at Narayanguda, Hyderabad.

**Item No.III:** House No.3-5-992/1, (or any part thereof), situated at Narayanguda, Hyderabad.

**Item No.IV:** All that land, (or any part thereof) including H.Nos.3-127, 3-128, 3-129 & 3-130, surrounded by compound wall in Survey No.1123, Situated at Madchal, (Old Ranga Reddy District) Medchal-Malkajgiri District.

or any part thereof, pending disposal of the Final Decree proceedings **BY ORDER OF THE COURT, Dated: 14-03-2023 in I.A.No.242 of 2022 in I.A.No.448 of 2006 in O.S.No.1287 of 1985.** As such the general public is hereby warned not to enter into any agreement, sale, Mortgage, Gift or any other mode of transfer. If inspite of this notice, should any person enter into any transactions, he/she would be doing so at their own risks and responsibility and we wll be constrained to take appropriate legal action both the Civil & Criminal to get the same cancel.Hence this Publication

**ARUN RAO G.N.TULIAPURKAR,**
**YOUGESH A.N.TULJAPURKAR,**
ADVOCATES, # H.No.4-5-728, "BHAVANI KRUPA",
Kutbiguda, Hyderabad-500027
**Mob.Nos.09440528916/9440372215**

# యాప్రాల్‌లో జోరందుకున్న అక్రమ నిర్మాణాలు

## హై టెన్షన్ లైన్‌లో అక్రమ సెల్లార్ - తొంగి చూడని టౌన్ ప్లానింగ్ అధికారులు


నిబంధనలకు విరుద్ధంగా నిర్మిస్తున్న బహుళ అంతస్తుల భవనాలు

**నేరేడ్‌మెట్, జూన్ 25 ప్రభాతవార్త :** మల్కాజిగిరి సర్కిల్ టౌన్ ప్లానింగ్ అధికారుల నిర్లక్ష్యం కారణంగా నేరేడ్‌మేట్ డివిజన్ యాప్రాల్ పరిధిలో జోరుగా అక్రమ సెల్లార్ నిర్మాణాలు, ఓసి పత్రం తీసుకున్న తరువాత వదిలిన 10 ఫీట్ సెట్‌బ్యాక్‌లలో 6అంతస్తులవరకు అక్రమనిర్మాణాలు చేపడుతూ ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నా అధికారులు మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు వ్యహరిస్తున్నారు. ముఖ్యంగా యాప్రాల్ పరిధిలోని హై టెన్షన్‌లైన్‌లో ఓ ఫిజియోథెరపిస్ట్ అక్రమంగా సెల్లార్‌తోపాటు డివియేషన్‌లకు పాల్పడుతూ బహుళ అంతస్తుల నిర్మాణాన్ని చేపట్టిన అధికారులు చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారు. అదేవిధంగా యాప్రాల్ పెడస్కో పేస్ 2 లో ఓ బిల్డర్ అక్యుపెన్సీ సర్టిఫికేట్ తీసుకున్న అనంతరం డీవియేషన్‌కు పాల్పడుతూ పది ఫీట్ల సెట్‌బ్యాక్‌లో ఐదు అతస్తుల అక్రమ నిర్మాణ పనులు కొనసాగిస్తున్నారు. ఓ వైపు ప్రభుత్వఖజానాకు గండి కొడుతూ జోరుగా నడుస్తున్న అక్రమ నిర్మాణాలు, మరోవైపు చైర్మన్లు, టౌన్ ప్లానింగ్ అధికారుల చేతివాటంతో అక్రమ నిర్మాణదారులకు అడ్డు అదుపు లేకుండా పోయింది. పలుమార్లు అధికారులకు స్థానిక ప్రజల నుంచి ప్రజా సంఘాల నాయకుల నుంచి ఫిర్యాదులు అందిన అధికారులు మాత్రం అక్రమ నిర్మాణాలపై ఎలాంటి చర్యలు చేపట్టకపోవడం పై పలు అనుమానాలకు తావిస్తుంది. మల్కాజిగిరి సర్కిల్ పరిధిలోని నేరేడ్‌మెట్ మల్కాజిగిరి వినాయకనగర్ డివిజన్లో విరివిగా అక్రమ నిర్మాణాలు కొనసాగుతున్నాయి. అధికారులు ముడుపులు తీసుకుని ప్రభుత్వ ఆదాయానికి గండికొడుతున్నారని బహిరంగ చర్చనీయాంశంగా మారింది.

# కాలనీవాసులపై పెరిగిపోతున్న పండ్ల వ్యాపారస్తుల దౌర్జన్యం

## నివాస గృహాల మధ్య వ్యాపారాలు - చోద్యం చూస్తున్న పోలీసులు, మున్సిపల్ అధికారులు


నిరసన వ్యక్తం చేస్తున్న కాలనీవాసులు

**ఎల్.బి.నగర్, జూన్ 25 ప్రభాతవార్త :** పండ్ల వ్యాపారస్తులు అగడాలు రోజు రోజుకు పెరిగిపోతున్నాయి. పండ్ల వ్యాపారస్తుల వ్యాపారం కారణంగా పలు కాలనీవాసులు తీవ్రఇక్కట్లకు గురవుతున్నప్పటికీ పట్టించుకునే నాధుడే కరువయ్యాడు. రోడ్లపై వాహనాలు నిలిపి తీవ్ర ట్రాఫిక్ సమస్యకు కారణమవుతున్న పండ్ల వ్యాపారస్తులను కాలనీవాసులు ఎవరైనా ప్రశ్నిస్తే వారిపై భౌతిక దాడికి పాల్పడుతున్నారు. చైతన్యపురి పోలీస్‌స్టేషన్ పక్క సందులోనే వ్యాపారస్తులు రాజ్యమేలుతున్నారు. వారం క్రితం ప్రభాస్‌నగర్ కాలనీలో ట్రాఫిక్ సమస్యను దృష్టిలో పెట్టుకొని పండ్ల వ్యాపారం చేయవద్దని, వాహనాలు నిల్పవద్దని ఒకరోజు ట్రాఫిక్ పోలీసులు హడావిడి చేసి బారికేడ్లు ఏర్పాటు చేశారు. కాలనీవాసులు పెద్ద ఎత్తున అక్కడికి చేరుకొని పండ్ల వ్యాపారస్తులు కాలనీలోకి రాకుండా అడ్డుకున్నారు. అయితే కొందరు నివాస గృహాలను వ్యాపారస్తులకు అద్దెకు ఇవ్వడంతో వ్యాపారస్తులు తాము అద్దె చెల్లిస్తున్నామని బరాబర్ వ్యాపారం చేస్తామంటూ కాలనీవాసులపైకే దౌర్జన్యానికి వస్తున్నారు. సుమారు 10 కాలనీలకు చెందినవారు ఈ దారి గుండా ప్రయాణిస్తుంటారు. ఉదయం విద్యా సంస్థలకు ఉద్యోగాలకు వెళ్లే వారి పరిస్థితి పండ్ల వ్యాపారస్తుల కారణంగా దయనీయంగా తయారైందని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గడ్డిఅన్నారం పండ్లమార్కెట్ తొలగించిన అనంతరం నుంచి ప్రభాత్‌నగర్ కాలనీలో ప్రశాంతత లేకుండాపోయిందని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గృహ సముదాయాల ముందు వాహనాలు అడ్డంగా నిలిపి వ్యాపారం చేస్తున్న వారిని స్థానికులు ఎవరైనా ప్రశ్నిస్తే వారిపైనే దౌర్జన్యానికి పాల్పడిన సంఘటనలు అనేకమున్నాయి. అధికారులు మాత్రం కేవలం ఒకరోజు హడావిడిచేసి చేతులు దులుపుకుంటున్నారని కాలనీవాసులు ఆరోపిస్తున్నారు. పోలీసులు, మున్సిపల్ సిబ్బంది చేతివాటానికి అలవాటు పడి చూసి చూడనట్లు వదిలేయడం వల్లే వ్యాపారస్తులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని కాలనీవాసులు తెలిపారు. నివాస గృహాల మధ్య వ్యాపారాలు చేయవద్దని ఆదివారం కాలనీవాసులు నిలదీయడంతో వ్యాపారస్తులు కాలనీవాసులతో గొడవకు దిగారు. వ్యాపారస్తుల తీరుపట్ల ఆగ్రహం వ్యక్తంచేస్తూ కాలనీవాసులు నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఇప్పటికైనా పోలీసులు, మున్సిపల్ అధికారులు పండ్ల వ్యాపారస్తులపై ప్రత్యేక దృష్టిసారించి సమస్యను పరిష్కరించాలని కాలనీవాసులు డిమాండ్ చేస్తున్నారు.

### ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

**మలక్‌పేట, జూన్ 25 ప్రభాతవార్త :** మధ్య వయస్సు దాటిన తర్వాత వచ్చే మోకాళ్ల కీళ్లనొప్పులకు కాలంచెల్లిందని శ్రీకర హాస్పిటల్స్‌కు చెందిన ప్రముఖ కీళ్ల తుంటి వైద్య నిపుణులు డాక్టర్ అభిషేక్ బర్లి అన్నారు. శ్రీపురం కాలనీ కమ్యూనిటీ హాల్‌లో ఆదివారం ఆర్ఆర్ ఫౌండేషన్ నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో డాక్టర్ బర్లీ పాల్గొని వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ అధ్యక్షులు వేణుమాధవ్ మాట్లాడుతూ కరోనా సమయంలో సమాజంలో చోటు చేసుకున్న హృదయ విదారక ఘటనలు చూసి తన మనసు చలించిందని అప్పుడే తోటి వారికి సహాయం చేయాలని ఆలోచన కలిగిందని వెంటనే తన తల్లితండ్రుల పేరుమీద ఆర్ఆర్ ఫౌండేషన్ స్థాపించి, ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాలనీ కార్యదర్శి రామారావు, అధ్యక్షులు కొండల్‌రెడ్డి, విజయవర్ధన్‌రాజు, మాధవరాజు, బక్క పాల్సన్ రాజు, సతీష్‌రెడ్డి, ఫౌండేషన్ కార్యదర్శి చేపూరి రవీంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

## వైశ్య వికాస వేదిక ఆధ్వర్యంలో విద్యార్థులకు ప్రతిభా పురస్కారాల ప్రధానం


విద్యార్థులకు పురస్కారాలు అందజేస్తున్న ముఖ్య అతిథులు

**సైదాబాద్, జూన్ 25 ప్రభాతవార్త:** పదవ తరగతి, ఇంటర్మీడియట్‌లో ప్రతిభను కనబర్చిన విద్యార్థులకు వైశ్య వికాస వేదిక ఆధ్వర్యంలో కర్మన్‌ఘాట్‌లోని శ్రీ లక్ష్మికన్వెన్షన్‌లో జరిగిన కార్యక్రమంలో ప్రతిభా పురస్కారాలు అందజేశారు. వైశ్య వికాస వేదిక చైర్మన్ డాక్టర్ కాచం సత్యనారాయణ సభాధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా తెలంగాణా డైరీ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ సోమ భరత్ కుమార్, ఎమ్మెల్సీ బుగ్గారపు దయానంద్‌గుప్తా, ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి, రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు అమరవాది లక్ష్మీనారాయణలు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైశ్య వికాస వేదిక ద్వారా ప్రతిభ గల విద్యార్థులకు పురస్కారాలు అందజేయడం అభినందనీయమన్నారు. వైశ్య వికాస వేదిక అధ్యక్షుడు కాచం సత్యనారాయణ గుప్తా మాట్లాడుతూ 4 సంవత్సరాల్లో మొత్తం 4900 మంది విద్యార్థులకు వైశ్య వికాస వేదిక ద్వారా ప్రోత్సాహక బహుమతులు, 1100 మంది ప్రభుత్వ ఉపాధ్యాయులను సన్మానించడం జరిగిందన్నారు. వైశ్య వికాసవేదికకు 12 అంతర్జాతీయ అవార్డులు వచ్చాయని అన్నారు. చదువు విషయంలో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొనే వారు తనను సంప్రదించాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి ఉప్పల వెంకటేష్ గుప్తా, మాజీ కార్పొరేషన్ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్, రావికంటి శ్రీనివాస్, గుండా మల్లయ్య, వైశ్య వికాస వేదిక సభ్యులు కాచం సుష్మ, టివిఎస్ మహేశ్వరరావు, కోశాధికారి కండె రామ్ నరేష్, నంగునూరు రమేష్, కాచం సాయి, కిషన్ గుప్తా, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## గాయపడ్డ బాధితులకు తోట ఆర్థిక సాయం


బాధితులకు చెక్కు అందజేస్తున్న తోట మహేష్‌యాదవ్

**ఎల్.బి.నగర్, జూన్ 25 ప్రభాతవార్త :** చైతన్యపురి డివిజన్ మున్సిపల్‌కాలనీలో ఇంటి పైకప్పు కూలిన సంఘటనలో గాయపడ్డ బాధితులకు అండగా నిలుస్తామని చైతన్యపురి డివిజన్ బిఆర్ఎస్ అధ్యక్షుడు తోట మహేష్‌యాదవ్ పేర్కొన్నారు. ప్రమాదంలో గాయపడ్డ ఆంగోత్ రంగనాయక్, అతని భార్య బింధు, కొడుకులు బాబుగౌతమ్, 2నెలల బాబుకు తలకు, వీపుకు, చేతులు, కాళ్ళపై గాయాలయ్యాయి. ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి ఆదేశాల మేరకు మహేష్‌యాదవ్ ఆదివారం బాధిత కుటుంబసభ్యులకు ఆర్థిక సహాయంగా అందజేశారు. వారికి ప్రభుత్వం తరఫునుంచి కూడా సహాయం చేసేందుకు ఎమ్మెల్యే హామీనిచ్చారని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో మహిళా అధ్యక్షురాలు నాగలక్ష్మి, సంపత్‌కుమార్, వీరపవన్‌నాయుడు, మహేష్‌రెడ్డి, మున్సిపల్‌కాలనీ మాజీ అధ్యక్షులు భాస్కర్ పాల్గొన్నారు.

## వినియోగదారులకు మెరుగైన సేవలు అందించాలి : స్పీకర్ పోచారం


సమావేశంలో ప్రసంగిస్తున్న స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి, చిత్రంలో చైర్మన్ చంద్రశేఖర్, సినీ హీరో సుమన్ తదితరులు

**మలక్‌పేట, జూన్ 25 ప్రభాతవార్త :** వినియోగదారులకు మెరుగైన సేవలు అందించాలని రాష్ట్ర శాసన సభ స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి, ప్రముఖ సినీ హీరో సుమన్ పేర్కొన్నారు. మలక్‌పేటలోని తిరుమల బ్యాంక్ ఏర్పాటు చేసి 25 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా బ్యాంక్ ఛైర్మన్ నగనూరి చంద్రశేఖర్‌ఆధ్వర్యంలో మలక్‌పేటలోని బ్యాంకు ఆవరణలో ఏర్పాటుచేసిన ఎటిఎం కేంద్రాన్ని వారు ముఖ్య అతిథులుగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వినియోగదారుల ఆదరాభిమానాలను చూరగొంటూ దశాబ్దాల కాలంనుండి తిరుమల బ్యాంకును విజయవంతంగా నిర్వహిస్తున్న ఛైర్మన్ చంద్రశేఖర్‌ను వారు అభినందించారు. బ్యాకింగ్ రంగం అభివృద్ధి చెందాలంటే యాజమాన్యంపై ఆధారపడి ఉంటుందన్నారు. బ్యాంకులు నమ్మకం, విశ్వాసం కలిగించినప్పుడే అభివృద్ధి చెందుతాయన్నారు. అనంతరం ఛైర్మన్ మాట్లాడుతూ బ్యాంకును ఏర్పాటుచేసి 25 సంత్సరాలు అవుతుందని, వినియోగదారులకు ఎళ్లవేళలా అందుబాటులో ఉండి వారికి అత్యుత్తమ సేవలు అందిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పి.శ్రీనివాస్, ఎన్‌పిసిఐ ఇంచార్జి సాంబ సాయికుమార్, జిఎం శోభనాద్రి, సిఇఓ రాజారావు, మేనేజర్ రవిశంకర్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## గుండెపోటుతో మృతిచెందిన ఎస్సై కుటుంబ సభ్యులకు చేయూతనందించిన బ్యాచ్‌మేట్స్


ఎస్సై కుటుంబ సభ్యులకు చెక్కును అందిస్తున్న బ్యాచ్‌మేట్స్

**హయత్‌నగర్, జూన్ 25 ప్రభాతవార్త:** గుండెపోటుతో మృతిచెందిన దుండిగల్ ఎస్సై ప్రభాకర్‌రెడ్డి కుటుంబ సభ్యులను ఆదుకునే క్రమంలో అతని బ్యాచ్‌మేట్స్ 25లక్షల రూపాయలను సమీకరించి అతని కూతురు అక్షయరెడ్డి పేరున ఫిక్స్‌డ్ డిపాజిట్ చేశారు. దుండిగల్‌లో ఎస్సైగా పనిచేసే ప్రభాకర్‌రెడ్డి ఈనెల 8న గుండెపోటులో మృతి చెందాడు. దీంతో కుటుంబాన్ని ఆర్థికంగా ఆదుకునే క్రమంలో 2014 బ్యాచ్(టీఎస్‌అండ్‌ఏపీ)వెల్ఫేర్ సొసైటీ తరపున 25 లక్షల రూపాయలను సమీకరించి 20 లక్షల రూపాయలను కూతరు పేరున మ్యూచవల్ ఫండ్స్ రూపంలో ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసి హయత్‌నగర్‌లో ఉంటున్న అతని భార్య లక్ష్మిప్రసన్నకు సంబంధిత పత్రాలను అందించారు. మరో 5 లక్షల రూపాయలను ప్రభాకర్‌రెడ్డి తల్లిదండ్రులకు అందజేశారు. కార్యక్రమంలో ప్రభాకర్‌రెడ్డి సోదరుడు దయాకర్‌రెడ్డి, సొసైటీ అధ్యక్షుడు టాటాశ్రీధర్, రామకృష్ణ, శ్రీనివాసులు పాల్గొన్నారు.

## అభివృద్ధి పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలి : కార్పొరేటర్ పవన్‌కుమార్

**ఎల్.బి.నగర్, జూన్ 25 ప్రభాతవార్త :** అభివృద్ధి పనుల విషయంలో అధికారులు, కాంట్రాక్టర్లు నాణ్యత ప్రమాణాలను పాటించాలని కొత్తపేట డివిజన్ కార్పొరేటర్ నాయకోటి పవన్‌కుమార్ సూచించారు. కొత్తపేట డివిజన్ శివశంకర్‌కాలనీలో కాలనీ వాసులతో కలిసి కార్పొరేటర్ నాయికోటి పవన్‌కుమార్ పర్యటించి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కాలనీలో నూతనంగా నిర్మిస్తున్న సిసి రోడ్డు పనులను పరిశీలించారు. రోడ్డు పనులలో లెవెల్స్ సరిచూసుకోవాలనీ, వర్షపు నీరు నిలవకుండా నిర్మాణం చేయాలన్నారు. కాలనీ ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా పనులు చేపట్టాలన్నారు. కాలనీలో నేలకొరిగిన విద్యుత్ స్తంభాల వల్ల ఎలాంటి ప్రమాదాలు జరగకుండా స్తంభాలను మార్చాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో డి.క్రిష్ణ, రమేష్‌చారి, నాగేశ్వర్‌రావు, నాయకులు కిరణ్‌గౌడ్, కొత్త తిరుమల, శివ తదితరులు పాల్గొన్నారు.

## మహేశ్వరం నియోజకవర్గంలో ప్రాచీన ఆలయాలకు మహర్దశ: మంత్రి సబితారెడ్డి


ఆలయాన్ని సందర్శించి పురాతన కోనేరును పరిశీలిస్తున్న మంత్రి సబితారెడ్డి

**సరూర్‌నగర్, జూన్ 25 ప్రభాతవార్త:** మహేశ్వరం నియోజకవర్గంలోని ప్రాచీన దేవాలయాలను రూ.8 కోట్లతో అభివృద్ధి చేయనున్నామని మంత్రి, పి.సబితా ఇంద్రారెడ్డి వెల్లడించారు. ఇటీవల నిధులు మంజూరు చేయించిన బాలాపూర్‌లోని అతి పురాతనమైన శ్రీ సంతాన వేణుగోపాల స్వామి దేవాలయాన్ని ఆదివారం మంత్రి సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ఆమె ప్రాచీన ఆలయాన్ని, పురాతన కోనేరును పరిశీలించారు. ఈ మేరకు మంజూరైన రూ.కోటి నిధులతో చేపట్టాల్సిన పనులపై సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దేవాదాయ శాఖ తరఫున నియోజకవర్గంలోని జిల్లెలగూడ వెంకటేశ్వర స్వామి ఆలయం, బాలాపూర్ సంతాన వేణుగోపాలస్వామి ఆలయంతో పలు ఆలయాలకు రూ.కోటి చొప్పున మంజూరు చేయించి నిధులను విడుదల చేయించామని వివరించారు. ఈ నిధులతో ఆయా ఆలయాల్లో అభివృద్ధి పనులు చేయించి భక్తులకు సౌకర్యాలు కల్పించే పనులు జరిపిస్తామని ఆమె పేర్కొన్నారు. ఆలయ ఛైర్మన్ కొలన్ కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో బడంగ్‌పేట్ డిప్యూటీ మేయర్ ఇబ్రాం శేఖర్, కో-ఆప్షన్ సభ్యుడు గుండోజు రఘునందనచారి, బిఆర్ఎస్ సీనియర్ నాయకులు వంగేటి లక్ష్మారెడ్డి, కళ్లెం ఎల్లారెడ్డి, తిమ్మని గిరీష్, పన్నాల కృష్ణారెడ్డి, భాగ్యనగర్ సొసైటీ డైరెక్టర్ చిగిరింత శ్రీరాంరెడ్డి, ఆలయ కమిటీ డైరెక్టర్లు పన్నాల గోపాల్‌రెడ్డి, ఆంజనేయచారి, కళ్లెం మల్లారెడ్డి, మల్లారెడ్డి, గడ్డం వెంకటేష్, జూకంటి సురేష్‌గౌడ్, కొప్పుల రాజు, అత్తాపురం శివారెడ్డి, బాల్‌రెడ్డి, కళ్లెం నిరంజన్‌రెడ్డిలతో పాటు రామిడి రాంరెడ్డి, పెద్దబావి ఆనంద్‌రెడ్డి, బొర్ర జగన్‌రెడ్డి, ఏనుగు రాంరెడ్డి, జెనిగె శ్రీనివాస్ యాదవ్, పోరెడ్డి వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## శక్తి కేంద్రాల ఏర్పాటుతో బిజెపి శ్రేణుల్లో ఉత్సాహం : ఆకుల శ్రీనివాస్

**తార్నాక, జూన్ 25 ప్రభాతవార్త :** శక్తి కేంద్రాల ఏర్పాటుతో బిజెపి శ్రేణుల్లో ఉత్సాహం కల్గుతుందని బిజెపి ఓబీసీ సెల్ మహంకాళి జిల్లా ఉపాధ్యక్షులు ఆకుల శ్రీనివాస్ పేర్కొన్నారు. శక్తికేంద్రం ఇంచార్జి ఆకుల శ్రీనివాస్ ఆద్వర్యంలో ఆదివారం తార్నాక డివిజన్‌లో ఇంటింటికి బిజెపి కార్యక్రమాన్ని నిర్వహించారు. 9 సంవత్సరాల్లో కేంద్ర ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి పథకాలపై రూపొందించిన కరపత్రాలను నాయకులు, కార్యకర్తలతో కలిసి శ్రీనివాస్ తార్నాక సండే మార్కెట్ బూత్ నెం.200 నుంచి 202 వరకు ఇంటింటికి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్, రాష్ట్ర నాయకులు వెంకటేష్ గౌడ్ మాట్లాడుతూ ఇంటింటికి వెళ్లడంతో ప్రజలు తమకు సమస్యలు చెబుతున్నారని పేర్కొన్నారు. రోజు రోజుకు బిజెపిపై ప్రజల్లో ఆదరణ పెరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు సుక్కగణేష్ ముదిరాజ్, రాముపర్మ, బిక్షపతి, సతీష్ రెడ్డి, లింగం, ప్రకాష్ గౌడ్, రామకృష్ణ, బండారి మహేష్, నవీన్, జగన్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

## 20 లక్షలతో సీసీ రోడ్డు పనులు : మైనంపల్లి


సిసి రోడ్డు పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మైనంపల్లి తదితరులు

**మల్కాజిగిరి, జూన్ 25 ప్రభాతవార్త :** ఈస్ట్ ఆనంద్ భాగ్ డివిజన్ పరిధిలోని పీవిఎన్ కాలని సాయిబాబా దేవాలయం దగ్గర 20 లక్షలతో సీసీ రోడ్డు పనులను ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు, కార్పొరేటర్ వై.ప్రేమ్‌కుమార్‌తో కలిసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఏఈ శ్రీకాంత్, వర్క్ ఇన్‌స్పెక్టర్ రజినికాంత్, నాయకులు సత్యమూర్తి, బాబు, సత్యనారాయణ, సంపత్ రావు, ఉమాపతి, బ్రమ్మయ్య, శంకర్ రావు, పోచయ్య భాస్కర్, బిక్షపతి, రవి, వేముల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## డ్రైనేజీ పైప్‌లైన్ పనుల నిర్మాణం పూర్తి...

### తవ్విన రోడ్డును పూడ్చడం మరిచిన అధికారులు...

**ఎల్.బి.నగర్, జూన్ 25 ప్రభాతవార్త :** డ్రైనేజీ నిర్మాణం కోసం రోడ్డును తవ్విన అధికారులు రోడ్డు నిర్మాణాన్ని గాలికి వదిలేశారు. నాలుగు సంవత్సరాల క్రితం నిర్మించిన సిసి రోడ్డును పగలగొట్టి డ్రైనేజీ పైప్‌లైన్ నిర్మాణం పనులను ఏడాది క్రితం పూర్తి చేశారు. ఏడాది క్రితం నుంచి తవ్విన రోడ్డును నిర్మించకపోవడంతో కాలనీవాసులపరిస్థితి దుర్భరంగా తయారైంది. కొత్తపేట డివిజన్ ఈస్ట్ మారుతినగర్ లోని రోడ్‌నెంబర్ 8లో డ్రైనేజీ కోసం తొవ్విన రోడ్డు బురదమయంగా మారడంపట్ల కాలనీవాసులు తీవ్రఅసహనాన్ని వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై అధికారులు అవసరమైన చర్యలు తీసుకొని రోడ్డు నిర్మాణం పనులను చేపట్టాలని విజ్ఞప్తి చేశారు.

## బాలాజినగర్‌లో సిసి రోడ్డు పనులు ప్రారంభం

**సైదాబాద్, జూన్ 25 ప్రభాతవార్త:** ఐఎస్ సదన్ డివిజన్ బాలాజినగర్‌లో నూతనంగా చేపడుతున్న సిసి రోడ్డు నిర్మాణ పనులను కార్పొరేటర్ జంగం శ్వేత మధుకర్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ రోడ్డు నిర్మాణ పనులను నిర్దిష్టమైన నాణ్యత ప్రమాణాలతో చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు రేణుకముదిరాజ్, కాలనీ అధ్యక్షుడు అశోక్‌రెడ్డి, యాదయ్య, పర్వత్‌రెడ్డి, శ్రీమాన్, కైలాష్ పాల్గొన్నారు.

## ఘనంగా చల్లా పాపిరెడ్డి సంస్మరణ కార్యక్రమం


చల్లా పాపిరెడ్డికి నివాళులర్పిస్తున్న కెవిపి, కోదండరెడ్డి తదితరులు

**సరూర్‌నగర్, జూన్ 25 ప్రభాతవార్త:** రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి తండ్రి స్వర్గీయ చల్లా పాపిరెడ్డి సంస్మరణ కార్యక్రమం ఆదివారం చంపాపేట్ ఇన్నర్ రింగ్‌రోడ్డులోని లక్ష్మారెడ్డి గార్డెన్స్‌లో ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా హాజరైన మాజీ ఎంపిలు కెవిపి రామచంద్రరావు, వి.హనుమంతరావు, మల్లు రవి, ఎఐసిసి కార్యదర్శి వంశీచందర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కోదండరెడ్డి, టిపిసిసి అధికార ప్రతినిధి సంకేపల్లి సుధీర్‌రెడ్డి, టిపిసిసి ప్రధాన కార్యదర్శి చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి, పిసిసి కార్యదర్శి యెల్మేటి అమరేందర్‌రెడ్డి, ఎల్‌బినగర్, మహేశ్వరం నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు మల్‌రెడ్డి రాంరెడ్డి, దేప భాస్కర్‌రెడ్డి, పార్టీ సీనియర్ నాయకులు ఏనుగు జంగారెడ్డి, మిద్దెల జితేందర్, నాగర్‌కర్నూల్, మహబూబ్‌నగర్ డిసిసి అధ్యక్షులు వంశీకృష్ణ, కొత్వాల్ జ్ఞానేశ్వర్ ముదిరాజ్‌లతో పాటు పలువురు పాపిరెడ్డి చిత్రపటానికి ఘన నివాళులర్పించి చల్లాను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో చల్లా బాల్‌రెడ్డి, సిద్దాల శ్రీశైలం, దేవగోని కృష్ణ, ఎరుకల వెంకటేశ్‌గౌడ్, కీసర యాదిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ మలి దశ ఉద్యమకారుడు వెంకట్‌రెడ్డి అనారోగ్యంతో మృతి

### పాడె మోసి అభిమానాన్ని చాటుకున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి


వెంకట్‌రెడ్డి పాడెను మోస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి తదితరులు

**మన్సూరాబాద్, జూన్ 25 ప్రభాతవార్త :** తెలంగాణ మలి దశ ఉద్యమకారుడు, ఎల్‌బినగర్ ఆర్టీసీ కాలనీకి చెందిన కుక్కునూరు వెంకట్‌రెడ్డి (58) ఆనారోగ్యంతో కామినేని హాస్పిటల్‌లో చికిత్స పొందుతూ శనివారం మృతి చెందారు. ఆయన అంత్యక్రియలు ఆదివారం ఆయన నివాసంనుండి ప్రారంభమై నాగోల్ స్మశాన వాటికలో మధ్యాహ్నం ముగిసాయి. స్థానికంగా రాజకీయాలకతీతంగా అందరితో సాన్నిహిత్యంగాఉంటూ ఆజాత శత్రువుగా పేరు సంపాదించుకున్నారు. ఆదేవిధంగా ఎల్.బి.నగర్‌లో తెలంగాణ ఉద్యమంలో ఆర్టీసీ కాలనీతో పాటు పరిసరప్రాంతాల్లో యువతను ప్రోత్సహిస్తూ కీలక పాత్ర పోషించారు. ఆయన అంత్యక్రియల్లో ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షులు సామ రంగారెడ్డి, కాంగ్రెస్ నాయకులు జక్కిడి ప్రభాకర్‌రెడ్డి, కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి, నాయకులు ముద్రబోయిన శ్రీనివాసరావు, విశ్వేశ్వర్ రావు, జోగు రాములు, మహేష్‌రెడ్డి, వివిధ పార్టీల రాజకీయల నాయకులతో పాటు కాలనీవాసులు, పెద్ద ఎత్తున యువకులు పాల్గొని ఆయన భౌతిక ఖాయానికి నివాళులర్పించారు. ఈ అంతిమ యాత్రలో భాగంగా ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి వెంకట్‌రెడ్డి పాడె మోసి ఆయన అభిమానాన్ని చాటుకున్నారు.

## జూన్ 13వ తేదీన లండన్‌లో హత్యకు గురైన తేజస్వినిరెడ్డి మృతదేహం గ్రామానికి చేరిక


తేజస్వినిరెడ్డి మృతదేహానికి నివాళులర్పించిన ఎమ్మెల్యే కిషన్‌రెడ్డి తదితరులు ఇన్‌సెట్‌లో తేజస్వినిరెడ్డి ఫైల్ ఫోటో)

**తుర్కయంజాల్, జూన్ 25 ప్రభాతవార్త :** తుర్కయంజాల్ మున్సిపాలిటీ బ్రాహ్మణపల్లి గ్రామానికి చెందిన కొంతం తేజస్వినీరెడ్డి ఈ నెల 13వ తేదీన లండన్‌లో బ్రెజిల్‌కి చెందిన దుండగుడి కత్తి దాడికి హత్యకు గురైన ఆమె మృతదేహం ఆదివారం బ్రాహ్మణపల్లికి చేరుకుంది ఈ సందర్భంగా ఇబ్రహీంపట్నం నియోజకవర్గం ఎమ్మెల్యే, బిఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు మంచిరెడ్డి కిషన్‌రెడ్డి ఆమె మృతదేహానికి నివాళులర్పించి కుటుంబాన్ని సభ్యులను ఓదార్చారు. అదేవిధంగా ఎల్బీనగర్ నియోజకవర్గం కాంగ్రెస్ ఇంఛార్జి మల్‌రెడ్డి రాంరెడ్డి తేజస్వినిరెడ్డి మృతదేహానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కుటుంబానికి ధైర్యాన్ని ఇచ్చారు. సంఘటన జరగడం దురదృష్టకరమని హత్యకు పాల్పడిన అతని వదిలిపెట్టే ప్రసక్తే లేదని వారు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డిసిసిబి వైస్‌చైర్మన్ కొత్తకుర్మా సత్తయ్య, బిఆర్ఎస్ నాయకులు క్యామ మల్లేష్, కాంగ్రెస్ టీపీసీసీ కార్యదర్శి కొత్తకుర్మా శివకుమార్, జిల్లా రైతుబంధు సమితి అధ్యక్షుడు వంగేటి లక్ష్మారెడ్డి, కొంతం మల్లారెడ్డి, కొంతం మాధవరెడ్డి, కొంతం యాదిరెడ్డి, కుంట ఉదయశ్రీగోపాల్ రెడ్డి, కొండ్రు మల్లేష్, వెంకట్‌రెడ్డి, నక్క శివలింగంగౌడ్, కందాడ లక్ష్మారెడ్డి, సంపతీశ్వర్‌రెడ్డి, నరసింహారెడ్డి, వేముల అమరేందర్‌రెడ్డి, అశ్విని, కొండ్రు శ్రీనివాస్, మేతరి శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## సందడిగా మహాజన సంపర్క్ అభియాన్ - గడప గడపకు బిజెపి : శ్రీరాములుయాదవ్

**సరూర్‌నగర్, జూన్ 25 ప్రభాతవార్త:** మహేశ్వరం నియోజకవర్గంలో బిజెపి ఇంఛార్జి, పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అందెల శ్రీరాములు యాదవ్ నిర్వహిస్తున్న మహాజన సంపర్క్ అభియాన్ - గడప గడపకు బిజెపి కార్యక్రమం సందడిగా సాగుతుంది. ఆదివారం బడంగ్‌పేట్ కార్పొరేషన్‌లోని 19, 31 డివిజన్లలోని నిర్వహించిన కార్యక్రమం అట్టహాసంగా నిర్వహించి ప్రజా సమస్యలు తెలుసుకుంటూ కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రచారం చేయడానికి పాదయాత్రగా వస్తున్న అందెల బృందానికి మహిళా కార్పొరేటర్లు గౌర రమాదేవి శ్రీనివాస్, నిమ్మల సునీత శ్రీకాంత్‌గౌడ్‌లు పెద్ద ఎత్తున మహిళలతో కలిసి బోనాలతో స్వాగతం పలికారు. అనంతరం ఆయన కాలనీల్లో పర్యటించి కేంద్ర పథకాల కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేషన్ బిజెపి అధ్యక్షుడు చెరుకుపల్లి వెంకట్‌రెడ్డి, పార్టీ ఫ్లోర్ లీడర్ తోట శ్రీధర్‌రెడ్డి, కార్పొరేటర్లు రామోజీ అమిత శ్రీశైలంచారి, రామిడి మాధురి వీరకర్ణారెడ్డి, దడిగె శంకర్, గడ్డం లక్ష్మారెడ్డి, పార్టీ నాయకులు సామ సంజీవరెడ్డి, గుర్రం మల్లారెడ్డి, మద్ది రాజశేఖర్‌రెడ్డి, ఏనుగు ప్రభాకర్‌రెడ్డి, తర్రె మల్లేష్ యాదవ్, రామిడి శూరకర్ణారెడ్డి, రాళ్ళగూడెం రామకృష్ణారెడ్డి, మమత ఆనంద్, నీలా రవినాయక్‌లతో పాటు పెద్ద సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.

**సుల్తాన్‌పూర్‌లో బిజెపి సమావేశం..** బాలాపూర్ మండలం సుల్తాన్‌పూర్ కదారి బీరప్ప ఫంక్షన్ హాల్‌లో రాష్ట్ర బిజెపి కార్యవర్గ సభ్యుడు కొలన్ శంకర్‌రెడ్డి ఆధ్వర్యంలో శనివారం రాత్రి పార్టీ సీనియర్ కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా జాతీయ బిజెపి ఉపాధ్యక్షురాలు, ఎంపి భారతీ బహెన్ ధీరూభాయ్ షాల్ హాజరై ప్రసంగించారు. సంపర్క్‌సే - సమర్థన్‌లో భాగంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో జిల్లా బిజెపి అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి, పాపయ్యగౌడ్, సుధాకర్‌శర్మ, జంగయ్య యాదవ్, దేవేందర్‌రెడ్డితో పలువురు బిజెపి నాయకులు పాల్గొన్నారు.

## తేజ్ శ్రీ వికలాంగుల సంస్థకు ఎస్‌బిఐ స్టాఫ్ యూనియన్ నిత్యావసరాల పంపిణీ

**మల్కాజిగిరి, జూన్ 25 ప్రభాతవార్త :** ఎస్‌బిఐ స్టాఫ్ యూనియన్, హైదరాబాద్ సర్కిల్ 19వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని స్వచ్ఛంద కార్యక్రమాలతోపాటు ఆనంద్‌బాగ్‌లోని తేజ్‌శ్రీ డిసేబుల్డ్ సొసైటీ హోమ్ ఫర్ బ్లయిండ్‌కు 40వేల రూపాయల విలువైన కంప్యూటర్ టేబుళ్లు, దుప్పట్లు, వెట్ గ్రైండర్, వంటగది పాత్రలను ఎస్‌బిఐ స్టాఫ్ యూనియన్ హైదరాబాద్ సర్కిల్ జనరల్ సెక్రటరీ ఆర్.శ్రీరామ్ విరాళంగా అందజేశారు. అదే విధంగా ఎస్‌బిఐ స్టాఫ్ యూనియన్ హైదరాబాద్ సర్కిల్, యూనియన్ హైదరాబాద్ సర్కిల్, మాజీ ప్రధానకార్యదర్శి వై.తారకనాథ్ 19వవర్ధంతిని ప్రతి సంవత్సరం ఇదే రోజున జరుపుకుంటుంది. తేజ్‌శ్రీ వికలాంగుల సంస్థ, పాక్షిక మరియు పూర్తిగా అంధులైనటువంటి 25మంది యువతకు ఆశ్రయం కల్పిస్తున్నది. కార్యక్రమంలో యూనియన్ కమిటీ సభ్యులు ఆర్.ప్రసాద్, ఉత్తమ్ భరద్వాజ్, నాగ భాస్కర్‌రావు, జిఎన్‌వి సతిష్ కుమార్, సంతోష్, రాందాస్, కన్నా, సికింద్రాబాద్ మాడ్యూల్, యూనియన్ సభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఆధార్ శిబిరం సేవలు సద్వినియోగం చేసుకోవాలి

**సరూర్‌నగర్, జూన్ 25 ప్రభాతవార్త:** మీర్‌పేట్ కార్పొరేషన్‌లోని 45వ డివిజన్ డైనమిక్ కాలనీ కమ్యూనిటీ హాల్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన ఆధార్ శిబిరం అందించే సేవలను సద్వినియోగం చేసుకోవాలని డిప్యూటీ మేయర్ తీగల విక్రంరెడ్డి కోరారు. ఆదివారం స్థానిక కార్పొరేటర్ అక్కి మాధవి ఈశ్వర్ గౌడ్ ఆధ్వర్యంలో ఏర్పాటైన ఆధార్ ఎన్‌రోల్‌మెంట్ క్యాంపును విక్రంరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 29వ తేదీ వరకు ఉండే ఈ క్యాంపులో నూతన ఆధార్‌కార్డు, కార్డులో తప్పొప్పుల సవరణ, మొబైల్ లింక్, ఫోటో అప్డేట్ తదితర సేవలు అందిస్తారనీ ఈ నేపథ్యంలో అవసరమైన వారు వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో దీప్‌లాల్ చౌహాన్, కాలనీ అధ్యక్షుడు వెంకటరావు, నర్సింహచారి, నర్సింహరావు, లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.